శనివారం
27-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 67
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సాగరతీరంలో ఎర్రదండు కవాతు

విశాఖలో సీపీఐ రాష్ట్ర 27వ మహాసభలు ప్రారంభం

విశాఖలో సీపీఐ భారీ ప్రదర్శన • ఆటపాటలతో ఉల్లాసంగా సాగిన ర్యాలీ

2లో

బీజేపీని గద్దె దించాల్సిందే

సభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

బహిరంగ సభలో ప్రసంగిస్తున్న డి.రాజా వేదికపై నారాయణ, రామకృష్ణ, ఓబులేసు, మానం ఆంజనేయులు, వందేమాతరం శ్రీనివాస్, జేవీఎస్ఎన్ మూర్తి, అనీరాజా, ముప్పాళ్ల, జల్లి విల్సన్, రావుల వెంకయ్య, వనజ, ఈశ్వరయ్య, దుర్గాభవానీ తదితరులు

- వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు కలిసి రావాలి
- ప్రాంతీయ పార్టీలు ప్రజల వైపు ఉన్నాయా... బీజేపీవైపా?
- బీహార్ పరిణామం ఓ మార్గనిర్దేశం
- మారకపోతే జగన్‌కు గుణపాఠం తప్పదు
- విశాఖ బహిరంగ సభలో సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా

భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్న మోదీ సర్కారును గద్దె దించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఉద్ఘాటించారు. ఇందుకోసం లౌకిక, ప్రజాస్వామ్య శక్తులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని ఓడించేందుకు తమ వంతు ప్రయత్నం కొనసాగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

2లో

కాంగ్రెస్‌కు ఆజాద్ గుడ్ బై

- ప్రాథమిక సభ్యత్వం సహా పదవులన్నింటికీ రాజీనామా
- పార్టీ సంకల్పం, సామర్థ్యం కోల్పోయింది
- కోటరీలోనే నడుస్తోంది... నాయకత్వమే బాధ్యత వహించాలి
- అధ్యక్షురాలు సోనియాకి ఐదు పేజీల లేఖ
- రాహుల్ తీరు పైనా విమర్శలు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీకి గులాం నబీ ఆజాద్ శుక్రవారం రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు పార్టీలోని అన్ని పదవులకు రాజీనామా చేస్తున్నట్టుగా ఆజాద్ ప్రకటించారు. తన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి పంపారు. వరుసగా నాయకులు పార్టీని వీడుతుండటంతో కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీలో కీలకమైన సంస్థాగత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీకి రాసిన ఐదు పేజీల సుదీర్ఘ లేఖలో, ఆజాద్ తన రాజీనామా విషయాన్ని ప్రకటించారు. భారతదేశానికి ఏది సరైనదో దాని కోసం పోరాడేందుకు ఏఐసీసీని నడిపే కోటరీ అధ్వర్యంలో కాంగ్రెస్ సంకల్పం, సామర్థ్యం రెండింటినీ కోల్పోయిందని పార్టీ మారాలని కోరుతూ జి-23 గ్రూపులో భాగమైన ఆజాద్ అన్నారు. 'భారత్ జోడో యాత్ర' ప్రారంభించే ముందు నాయకత్వం 'కాంగ్రెస్ జోడో యాత్ర' చేపట్టాల్సి

- మిగతా 2 లో

సీఎం సోరెన్‌పై అనర్హత వేటు

- శాసనసభ్యత్వం రద్దుకు ఈసీ సిఫార్సు
- మీడియా కథనాలు
- యూపీఏ ఎమ్మెల్యేల కీలక భేటీ

రాంచి : జార్ఖండ్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్న ఆరోపణల మధ్య, మైనింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై ఎన్నికల సంఘం శుక్రవారం అనర్హత వేటు వేసినట్లు అనేక మీడియా సంస్థలు నివేదించాయి. ఆయన శాసనసభ్యత్వం రద్దుకు

- మిగతా 2 లో

'ఇంజినీరింగ్' తనిఖీలేవి?

- కళాశాలల ప్రామాణికతపై సందేహాలు
- రేపటి నుంచి ఏపీఈఏపీసెట్ ఐచ్ఛికాలు
- 1,42,877 సీట్ల భర్తీకి రంగం సిద్ధం
- 261 కళాశాలల భాగస్వామ్యం
- ప్రైవేట్ వర్సిటీల సీట్లపై గోప్యత

2లో

ఏపీ ఈఏపీసెట్-2022 కౌన్సెలింగ్ ప్రక్రియకు సర్వం సన్నద్ధమైనప్పటికీ, కౌన్సెలింగ్‌లో భాగస్వామ్యమైన ఇంజినీరింగ్ కళాశాలల ప్రమాణికత తనిఖీల్లో జాప్యం నెలకొంది.

పార్టీ విద్యారంగం కులపతి కామ్రేడ్ నీలం



సిద్ధాంతం లేని ఆచరణ గుడ్డిది, ఆచరణ లేని సిద్ధాంతం గొడ్డుది అని కార్ల్‌మార్క్స్ చేసిన సూత్రీకరణను అక్షరాల అమలు చేసిన ఉద్యమకారుడు నీలం రాజశేఖర రెడ్డి. అర్థ శతాబ్దం పాటు భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలోనూ...ప్రజాసేవలో అవిశ్రాంతంగా పని చేసిన నీలం రాజశేఖర రెడ్డి జీవితంలో జాతీయోద్యమం, కమ్యూనిస్టు విప్లవోద్యమం అంతర్భాగాలు. ప్రతి అంశాన్ని సునిశితంగా పరిశీలించి, విశ్లేషించి పార్టీ అభివృద్ధికి బాటలు వేసిన ధీశాలి. కార్యకర్తల మెదళ్లకు పదును పెట్టకుండా పార్టీని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడం, నిర్మాణం సాధ్యం కాదని నమ్మి అందుకు అనుగుణంగా పార్టీలో సైద్ధాంతిక పునాదుల్ని పటిష్టం చేయడం కోసం కీలకమైన కార్యక్రమాల్ని చాలా సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యారంగ విస్తరణకు పూనుకున్నారు. రాజకీయ వ్యవహారాల్లో తలమునకలై ఉన్నా సైద్ధాంతిక పునాదుల్ని పటిష్టం చేసేలా పార్టీ విద్యారంగాన్ని పదునెక్కించడానికి వర్సిటీల్లో కులపతి తరహా గొప్పపాత్రను నిర్వహించారు. పార్టీ విద్యా కార్యక్రమాన్ని నిరంతరం కార్యక్రమంగా తీర్చిదిద్ది వేలాది మంది యువ కమ్యూనిస్టులకు సైద్ధాంతిక రాజకీయ పరిజ్ఞానాన్ని అందించారు. పార్టీ విద్యా విభాగం బాధ్యులుగా రెండు దశాబ్దాలు పనిచేశారు. అనంతపురం జిల్లాలోని ఇల్లూరు గ్రామంలో నీలం చిన్నపరెడ్డి, సుబ్బమ్మ దంపతులకు 1918లో నీలం రాజశేఖర రెడ్డి జన్మించారు. నాటి స్వాతంత్ర్య సమరయోధులు కల్లూరు సుబ్బారావు చొరవతో కాశీలోని హిందు విశ్వవిద్యాలయంలో తరిమెల నాగిరెడ్డితో పాటు చేరారు. అక్కడే మార్క్సిజం భావాలను, సైద్ధాంతికతలను పుణికిపుచ్చుకున్నారు. మానవునికున్న ఆస్తిలో అత్యంత విలువైనది జీవితమే...అలాంటి జీవితాన్ని మానవజాతి విముక్తికోసం వినియోగించానని సంతృప్తి పడేలా జీవించాలని కామ్రేడ్ లెనిన్ చెప్పిన మాటలు నీలం రాజశేఖర రెడ్డికి ఆదర్శమయ్యాయి. వర్సిటీలో చదువు ముగించుకుని వచ్చి 1938లో కమ్యూనిస్టు

- మిగతా 2 లో

లేపాక్షి భూములు

రైతులకు అప్పగించాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములను తిరిగి రైతులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు శుక్రవారం ఆయన ఒక లేఖ రాశారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం నాటి అనంతపురం జిల్లా, ప్రస్తుత శ్రీసత్యసాయి జిల్లా, చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో రైతులకు ఎకరాకు రూ.1.75లక్షలు చెల్లించి, 8,844 వేల ఎకరాల భూములను లేపాక్షి నాలెడ్జ్ హబ్ ఏర్పాటు పేరుతో సేకరించిందని గుర్తుచేశారు. తదుపరి ఆయా సంస్థలు రైతల భూముల్ని బ్యాంకుల్లో తనఖాపెట్టి రూ.4వేల కోట్ల రుణాల్ని తీసుకుని, అప్పు చెల్లించకుండా దివాలా ప్రక్రియను చేపట్టారని వివరించారు. ఆయా భూముల్లో లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఆశతో తమ భూములను అతి తక్కువకు అప్పగించిన రైతులకు నిరాశే మిగిలిందన్నారు. ఒకనాడు రైతులుగా బతికిన వారు వలస కూలీలుగా, కార్మికులుగా మారి దయనీయమైన జీవనం సాగిస్తున్నారని తెలిపారు. భూములిచ్చి 15 ఏళ్లు గడుస్తున్నప్పటికీ చిలమత్తూరు మండలంలో కొందరు రైతులకు ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదన్నారు. మరికొందరికి చెక్కులు ఇచ్చి వెనక్కి తీసుకున్నారనీ, ఆయా

- విక్రయాలపై మంత్రివర్గంలో సమీక్షేది?
- కారుచౌకగా కట్టబెట్టొద్దు
- ముఖ్యమంత్రికి రామకృష్ణ లేఖ

సర్వే నెంబర్లకు సంబంధించి ప్రభుత్వ రికార్డులైన 1బి, అడంగల్‌లో లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరు చూపించడంతో రైతులు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, రాయితీలు కోల్పోయారని పేర్కొన్నారు. ఇప్పుడు రూ.10వేల కోట్ల విలువ చేసే ఆయా భూములను కారుచౌకగా రూ.500 కోట్లకు దక్కించుకునేందుకు అరబిందో, రాంకీ, ఎర్తిన్ సంస్థలు పోటీపడుతున్నట్లు తెలుస్తోందన్నారు. ఈ మూడు కంపెనీలకు మేలు చేకూర్చేలా, ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని పేర్కొన్నారు. సీఎంగా అధికారం చేపట్టగానే వివిధ విభాగాల్లో 'రివర్స్ టెండరింగ్'ను అమలుచేశారనీ, లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల వ్యవహారంలో ఎందుకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు?, ఆ భూముల అమ్మకానికి సంబంధించి కనీసం మంత్రివర్గంలోనూ ఎందుకు సమీక్షించలేదు?, ఏపీఐఐసీ పెట్టిన పెట్టుబడులను తిరిగి తీసుకునేందుకు ఎందుకు ప్రయత్నించలేదు? అని ప్రశ్నించారు.. రైతుల



పొట్టకొట్టి గుత్త సంస్థలకు మేలు చేకూర్చే విధానాలను తీవ్రంగా ఖండించారు. వేల కోట్ల రూపాయల విలువ చేసే లేపాక్షి భూములను కారుచౌకగా అప్పగించాలనే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆ భూములను తాకట్టు పెట్టి వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి, కఠిన చర్యలు చేపట్టాలని, లేపాక్షి భూములను తిరిగి ఆయా రైతులకే అప్పగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

కుప్పంలో వైసీపీ విధ్వంసం దుర్మార్గం

కుప్పంలో వైసీపీ చేసిన విధ్వంసాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఖండించారు. మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు కుప్పం పర్యటన సందర్భంగా కుప్పంలో వైసీపీ శ్రేణులు ఘర్షణ వాతావరణం సృష్టించడం దుర్మార్గమని, పేదలకు రూ.5లకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్ల ఏర్పాటు అడ్డుకోవటం తగద న్నారు. జగన్ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలపై కక్షపూరిత ధోరణి విడనాడాలని, ప్రజాస్వామ్యంలో నిరసనలు శాంతియుతంగా ఉండాలేగాని, ప్రతిపక్షాలపై దాడులు, కక్షపూరిత చర్యలు సరైనవి కావని హితవు పలికారు. కుప్పంలో జరిగిన విధ్వంసకాండలో పోలీసుల వైఫల్యం వెలుగు చూస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు శాంతియుతంగా చేపట్టిన నిరసనలకు అనుమతులు ఇవ్వకుండా పలు ఇబ్బందులకు గురిచేస్తూ, నాయకు లను కార్యకర్తలను ముందస్తు నోటీసులు, గృహ నిర్బంధాలు, అరెస్టులు చేసే పోలీసు యంత్రాంగం కుప్పంలో వైసీపీ నిరసన కార్యక్రమానికి అనుమతి ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అధికార వైసీపీ తమ వారికో నీతి, ఇతరులకు మరో రీతిగా వ్యవహరించటం ప్రజాస్వామిక వ్యవస్థకు పెను విఘాతమన్నారు. కుప్పంలో వైసీపీ శ్రేణులు సృష్టించిన విధ్వంసంపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించా లని, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

దాడులకు భయపడేదే లేదు: చంద్రబాబు

విశాలాంధ్ర- తిరుపతి: 'మూడేళ్లలో అనేక చోట్ల నా పర్యటనకు అడ్డంకులు సృష్టించారు. ఇలాంటి దాడులకు భయపడేదే లేదు' అని టీడీపీ అధినేత, ప్రతిపక్షనేత నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. చంద్రబాబు పర్యటన కుప్పంలో మూడోరోజు శుక్రవారం కొనసాగింది. నియోజవకర్గంలోని కృష్ణానంద పల్లి, గుండ్లనాయనపల్లి, కొత్తూరులో బాబు పర్యటించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గురువారం ఘటనల నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. మరోవైపు చంద్రబాబుకు భద్రత పెంచారు. రాత్రి కుప్పంలోనే బసచేసిన చంద్రబాబు, శుక్రవారం ఉదయం పార్టీ కార్యకర్తలతో మరోసారి సమావేశమై తాజా పరిస్థితిని సమీక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కుప్పంకు చేరుకోవడంతో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతకుముందు వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలను ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ముందుగా అనుకున్న షెడ్యూలు మేరకు కృష్ణానందపల్లి, గుండ్లనాయనపలి, కొత్తూరు గ్రామాల్లో చంద్రబాబు రోడ్ షో నిర్వహించారు. దారి పొడవునా భారీగా ప్రజలు, టీడీపీ కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. రాష్ట్రంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే.. బ్రిటిష్ వాళ్లే నయమనిపించిందని చంద్రబాబు అన్నారు. చంద్రబాబు పర్యటన సందర్భంగా ఆయనకు భద్రత మరింత పెంచారు. గతంలో ఆరుగురు ఎన్‌ఎస్‌జీ ఉండగా, ప్రస్తుతం దాన్ని రెట్టింపు చేశారు. గతంలో డీఎస్పీ ర్యాంకు అధికారి పర్యవేక్షణలో భద్రత సిబ్బంది విధులు నిర్వర్తించేవారు. దాన్ని ఇకపై డీఐజీ ర్యాంకుకు పెంచారు. ఇటీవల జరుగుతున్న ఘర్షణల నేపథ్యంలో భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. .

ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

- పర్యావరణ పరిరక్షణ ప్రత్యేక చర్యలు
- పార్లే, గ్లోబల్ అలయన్స్‌తో ఒప్పందం
- సీఎం జగన్ వెల్లడి

విశాలాంధ్ర-విశాఖ సిటీ: ఏపీలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు సీఎం జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. విశాఖలో బీచ్ క్లీనింగ్ పేరుతో సాగర తీరాన్ని శుభ్రపరిచే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శుక్రవారం నుంచి ఏపీలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు నిషేధిస్తున్నట్టు ప్రకటించారు. ఇకపై బ్యానర్లు కట్టాలంటే ఖర్చు ఎక్కువైనా క్లాత్‌తో తయారుచేసిన ఫ్లెక్సీలే వాడాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూనలో మొదటి అడుగుగా ఇక్కడ నుంచే పిలుపునిస్తున్నానని తెలిపారు. తిరుమలను ఇప్పటికే ప్లాస్టిక్ రహిత నగరంగా చేశారని, అక్కడ మంచి ఫలితాలు వచ్చాయని, ప్లాస్టిక్ బ్యాగులు బదులు క్లాత్ సంచులనే వాడుతున్నారన్నారు. ప్లాస్టిక్ లేనప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి అందుబాటు లోకి తెస్తామని, ఓ పద్ధతి ప్రకారం ఏపీని ప్లాస్టిక్ రహింతగా చేస్తూ 2027 నాటికి కాల్యుష్యం లేని రాష్ట్రంగా నిలబెట్టేందుకు అడుగులు వేస్తున్నామని జగన్ చెప్పారు.

ప్రపంచంలోనే అతి పెద్ద బీచ్ క్లీనింగ్

దాదాపు 22 వేల మంది ప్రజలు, 40 ప్రాంతాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొని దాదాపు 28 కిలోమీటర్లు మేర గోకుల్ బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు శుద్ధి చేశారని, 76 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారని జగన్ తెలిపారు. రాష్ట్రంలోనూ, దేశంలోనూ కూడా సముద్ర గర్భంలో కూడా ప్లాస్టిక్ కనిపిస్తున్న పరిస్థితులు, బహుశా ప్రపంచంలో కూడా చాలా చోట్ల ఇలాంటి పరిస్థితి ఉన్న నేపథ్యంలో.. వీటికి ఒక స్థిరమైన పరిష్కారం వెదికే దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అడుగులు ముందుకు వేస్తోందని, ఇందులో భాగంగానే ఏపీ ప్రభుత్వం రెండు కంపెనీలను భాగస్వామ్యులుగా ఆహ్వానించిం దన్నారు. ఒకటి గ్లోబల్ అలయెన్స్ ఫర్ సస్టయినబుల్ ప్లానెట్ వర్ఫ్ (జీఏఎస్పీ) కాగా, రెండోది పార్లే ఫర్ ది ఓషన్స్ కంపెనీ ముందుకొచ్చాయన్నారు. సాగర తీరాన్ని పరిరక్షించేందుకు గాను ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్లో ఏపీ ప్రభుత్వం, పార్లే ఫర్ ది ఓషన్స్ (ఎన్విరాన్మెంటల్ ఆర్గనైజేషన్) మధ్య అవగాహన ఒప్పందం జ రిగింది. సీఎం సమక్షంలో పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, పార్లే సంస్థ ప్రతినిధి సిరిల్ గచ్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్, లీడర్షిప్ కౌన్సిల్ జీఏఎస్పీ రాజీవ్ కుమార్, సెక్రటరీ జనరల్, గ్లోబల్ అలయెన్స్ ఫర్ సస్టయినబుల్ ప్లానెట్ సత్య ఎస్ త్రిపాఠి, సీఈఓ పార్లే ఫర్ ది ఓషన్స్ సిరిల్ గర్చ్ పాల్గొన్నారు.

విద్యారంగంలో సమూల మార్పులు: జగన్

విద్యారంగంలో సమూల మార్పులు చేస్తూ, చదువుకున్న ప్రతి యువతకు ఉపాధి లభించేలా నూతన కరికులమ్ తీసుకొస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. శుక్రవారం విశాఖలో నిర్వహించిన మైక్రోసాఫ్ట్‌లో శిక్షణ పొందిన విద్యార్థుల అభినందన సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సుమారు 35,980 మంది విద్యార్థులు మైక్రోసాఫ్ట్ అప్‌స్కిల్లింగ్ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నారని సీఎం తెలిపారు. 1.62 లక్షల మంది విద్యార్థులకు ఈ రకమైన సర్వీసు ఒకే రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ లాంటి సంస్థ కల్పించడం మును పెన్నడూ లేదని హర్షం వ్యక్తం చేశారు. మైక్రోసాఫ్ట్ టెక్నికల్ అసోసియేట్స్‌గా క్వాలిఫై అయి, సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పాఠ్యప్రణాళికలో సమూల మార్పులు తీసుకొచ్చామనీ, ఉద్యో గాల సాధనే ధ్యేయంగా, నైపుణ్యాలను పెంచేదిగా పాఠ్యప్రణాళికను తీర్చిదిద్దామన్నారు. సర్టిఫైడ్ కోర్సులను అందిస్తూ ఉద్యోగాల కల్పన దిశగా చదువులు ఉండాలన్నారు. ఈ శిక్షణకు ప్రభుత్వం రూ.32 కోట్లు సమకూర్చిందన్నారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ బూడి ముత్యాల నాయుడు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆది మూలపు సురేష్, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కుప్పం ఘటనపై గవర్నర్‌కు టీడీపీ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో వైసీపీ ప్రజా వ్యతిరేక పాలన, టీడీపీ కార్యకర్తలపై దాడులు, హత్యా సంఘటనలను నిరసిస్తూ... టీడీపీ నాయకులు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కుప్పంలో వైసీపీ శ్రేణులు వ్యవహరించిన తీరు, అన్న క్యాంటీన్ ధ్వంసం చేయడాన్ని గవర్నర్‌కు వివరించారు. అనంతరం మీడియాతో టీడీపీ నేతలు వర్ల రామయ్య, నక్కా ఆనందబాబు తదితరులు మాట్లాడారు. తాము ప్రస్తావించిన అంశాలపై గవర్నర్ స్పందించడం లేదన్నారు. గవర్నర్‌ను చాలా సందర్భాల్లో కలిశామని, దళితులపై పెరిగిపోతున్న దాడులపై వివరించామని గుర్తుచేశారు. దళితులపై దాడులు చేయడం తమ పేటెంట్ అని వైసీపీ భావిస్తున్నట్లుందని, దళితులకు స్వేచ్ఛగా జీవించే హక్కు లేదా? అని ప్రశ్నించారు. సీఎం జగన్ వచ్చినప్పుడల్లా గవర్నరుకు ఏం చెబుతున్నారో?, ఏమో? ప్రజా సమస్యల పరిష్కారంపై గవర్నర్ దృష్టి పెడుతున్నట్టు కన్పించడం లేదన్నారు. కుప్పం ఘటనపై విచారణ జరిపించాలని గవర్నరును కోరామన్నారు. రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోందని, కుప్పంలో జరిగిన ఘటనలపై ప్రజలు వైసీపీని అసహ్యించుకుంటున్నారని చెప్పారు. అయితే కుప్పంలో జరిగిన ఘటనపై విచారణ చేయిస్తామని గవర్నరు తమకు హామీ ఇచ్చారన్నారు.

వైద్యారోగ్యశాఖకు అవార్డు

విశాలాంధ్ర బ్యూరో- అమరా వతి: వైద్యారోగ్య శాఖకు అవార్డు లభించింది. ఇటీవల ద ఎకన మిక్ టైమ్స్ అధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహిం చిన డిజిటెక్ కాన్‌క్లేవ్-2022లో పాల్గొని, ప్రజల హెల్త్ రికార్డుల డిజిట లైజేషన్‌లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు రాష్ట్రాన్ని వరించిన అవార్డును వైద్యా రోగ్యశాఖ మంత్రి విడదల రజని అందు కున్నారు. ఈ మేరకు సీఎం క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆమె సీఎం జగన్‌ను కలిసి అవార్డును చూపించారు. ఈ సందర్భంగా మంత్రిని సీఎం అభినందించారు.

నేడు పాఠశాలలకు సెలవు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాలలకు ఈ నెల 27న (నాలుగో శనివారం)సెలవు దినంగా పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు కమిషనర్ కె.సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీజేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకుని స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లనిమిత్తం ఈ నెల 13న (రెండో శనివారం) రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, ఇతర విద్యా సంస్థలు పనిచేశాయి. సెలవు దినంలో పనిచేసినందున దానికి ప్రత్యామ్నాయంగా 27న సెలవు దినంగా పరిగణించుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సముద్ర తీరాన్ని కాపాడుకుందాం

మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సముద్ర తీరాన్ని కాపాడుకుందామంటూ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆది మూలపు సురేశ్ పిలుపునిచ్చారు. అమెరికాకు చెందిన పార్లె ఫర్ ది ఓషన్స్ సంస్థతో బీచ్ శుభ్రపరచే కార్యక్రమాన్ని శుక్రవారం రామకృష్ణ బీచ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పార్లె సంస్థతో తీరప్రాంత స్వచ్ఛతపై ఒప్పందం చేసుకుంటున్నట్లు చెప్పారు. సముద్రతీర ప్రాంతాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విశాఖలో 25 వేల మందితో 28 కిలో మీటర్ల దూరం 40 పాయింట్లలో మెగా సముద్ర తీర స్వచ్ఛత కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహి స్తున్నట్లు వివరించారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, రాష్ట్ర చరిత్రలో ఒక గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. తీరప్రాంతం అధికంగా ఉన్న రాష్ట్రం ఏపీ అని అన్నారు. కలసి కట్టుగా నగరాన్ని సుందరంగా తీర్చిదిద్ది పర్యావర ణాన్ని పరిరక్షించు కుందామన్నారు. మేయర్ గొల గాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ నగరాన్ని, సముద్ర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు.కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున మాట్లాడుతూ ,25 వేల మందితో సముద్ర తీర స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్లె సంస్థ ప్రతినిధి సిరిల్ మాట్లా డుతూ, ఇండియా గొప్ప దేశమని, విశాఖపట్నంలో తీర ప్రాంత స్వచ్ఛతకు శ్రీకారం చుడుతున్నామనీ, ప్లాస్టిక్ వ్యర్థాలు మనిషి అవయవాలకు నష్టం కలిగిస్తాయన్నారు. శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై. శ్రీలక్ష్మి, పురపాలక శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్, పోలీసు కమిషనర్ శ్రీకాంత్, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, జీవీఎంసీ కమిషనర్ లక్ష్మిశ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ సంపత్ కుమార్, పార్లె ఫర్ ఓషన్స్ సిరిల్ ప్రతినిధి త్రిపాఠి, అధికారులు పాల్గొన్నారు. అనంతరం బీచ్ శుభ్ర పరచే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆరోగ్య కార్డులు వినియోగంలోకి తేవాలి

ఉద్యోగ సంఘాలతో ట్రస్టు సీఈవో సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆరోగ్య కార్డులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వైద్యసేవలు నిరాకరించిన నెట్‌వర్క్ ఆస్పత్రులపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ యాప్ అభివృద్ధి చేయాలని అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, నాయకులు వైవీ రావు డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి వైద్యసౌకర్యాలు అందకపోవడాన్ని ఏడాదిక్రితం సీఎం దృష్టికి తీసుకెళ్లగా... స్పదించిన ప్రభుత్వం శుక్రవారం వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో హరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. బొప్పరాజు, వైవీరావు మాట్లాడుతూ, స్మార్ట్ హెల్త్‌కార్డులు చాలా మంది ఉద్యోగులకు అందలేదన్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలకు బకాయిలు సత్వరమే చెల్లించాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ రూ.2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచాలని కోరుతున్నప్పటికీ, ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకపోవడం దురదృష్టకరమని తెలిపారు. సీఈవో హరేంద్రప్రసాద్ స్పందిస్తూ, సమస్యలను పరిష్కరిస్తామని, ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్ఫ్రెడ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, యూటీఎఫ్ నేత ఎన్. వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్(1938) హృదయరాజు, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఏపీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు బండి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు. అనంతరం హెల్త్ కార్డుల సమస్యలు సత్వరమే పరిష్కరించా లంటూ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిమ్మన్న శుక్రవారం సీఈవో హరేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

కుప్పానికి చంద్రబాబు ఏం చేశారు?: అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కుప్పంకు చంద్రబాబు ఏం చేశారనీ... ఆయన చేసింది సున్నా అంటూ రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు దుయ్యబట్టారు. పార్టీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేయలేకపోయారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కుప్పం మున్సిపాలిటీ అయిందని, అవసరం కోసమే కుప్పంను చంద్రబాబు వాడుకుంటున్నారన్నారు. చంద్రబాబు 33 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉంటూ ఏం ఒరగబెట్టారని విమర్శించారు. కుప్పం తన చేతిలోంచి జారిపోతుందనే భయం పట్టుకున్నట్లు ఉందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక, చంద్రబాబుకు గెలుపే లేదని, మున్సిపల్, జిల్లా పరిషత్, సర్పంచ్... ఇలా ఏ ఎన్నికల్లోనూ డిపాజిట్లు రాలేదన్నారు.

కార్మికుల సంక్షేమానికే నూతన నిర్ణయాలు

విశాలాంధ్ర- తిరుపతి: కార్మికుల సంక్షేమం కోసమే నూతన నిర్ణయాలు తీసుకున్నామని కేంద్ర కార్మిక శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. దీన్లో భాగంగానే దేశవ్యాప్తంగా వస్తున్న సలహాలు సూచనలు తీసుకోవడం కోసం తిరుపతిలో రెండు రోజులు పాటు సదస్సు నిర్వహించినట్టు చెప్పారు. తిరుపతిలో 47వ జాతీయ కార్మిక సదస్సు రెండు రోజులపాటు జరిగింది. 25 రాష్ట్రాల నుంచి కార్మిక శాఖ మంత్రులు, కార్యదర్శులు ఈ సదస్సుకు హాజర య్యారు. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ పాల్గొని, ఆతిథ్యం ఇచ్చిన ఏపీ ప్రభుత్వం, తిరుపతి జిల్లా అధికారులను అభినందిం చారు. సదస్సు ముగింపు కార్యక్రమంలో వర్చువల్‌గా

కేంద్రమంత్రి భూపేందర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఏపీ కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్

సీఎం జగన్ మోహన్ రెడ్డి హాజరయ్యారు. తిరుపతిలోని తాజ్ హోటల్‌లో రెండో రోజు శుక్రవారం జరిగిన జాతీయ కార్మిక సదస్సుకు కేంద్ర కార్మిక, ఉపాధికల్పన, పర్యావరణం, అటవీశాఖ మంత్రి భూపేందర్ యాదవ్, కార్మిక, ఉపాధి కల్పన, పెట్రోలియం, సహజ వాయుశాఖల కేంద్ర సహాయ మంత్రి రామేశ్వర్ తేలి అధ్యక్ష వహించారు. వివిధ రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రులు, కార్యదర్శులు తమ రాష్ట్రాల్లో అమలవుతున్న కార్మిక సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సదస్సులో తీసుకున్న నిర్ణయాలు దేశంలోని కార్మికులను శక్తివంతం చేస్తాయని కేంద్రమంత్రి తెలిపారు. కార్మిక మంత్రిత్వ శాఖ సిద్ధం చేసిన విజన్-2047లోని ప్రధాన అంశాలను మంత్రి సదస్సు దృష్టికి తీసుకువచ్చారు. వివిధ రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రులు శ్రామిక విజన్ 2047లోని అంశాలపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. కొన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకొంటామని మంత్రి భూపేందర్ చెప్పారు. కార్మికులకు సార్వత్రిక, సామాజిక రక్షణ, ప్రతి ఒక్కరికీ మెరుగైన ఉపాధి అవకాశాలే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ప్రస్తుతం అమలులో ఉన్న సామాజిక భద్రతా పథకాలపై సదస్సులో సుదీర్ఘ చర్చించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం, అసంఘటిత రంగ కార్మికుల భద్రత కోసం ఏర్పాటు చేసిన ఈ-శ్రమ్ పోర్టల్ ప్రాధాన్యతను కేంద్ర మంత్రులు వివరించారు. వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సాయంత్రం ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వర్చువల్‌గా హాజరై ముగింపు సందేశం ఇచ్చారు. ఈసమావేశంలో సదస్సుకు అతిథ్యం ఇచ్చిన తిరుపతి జిల్లా, టీటీడీ అధికారులను కేంద్ర మంత్రులు సత్కరించారు.

కార్మిక చట్టాల పటిష్ఠతకు దోహదం

జాతీయ కార్మిక సదస్సులో సీఎం జగన్ ప్రసంగం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కార్మిక చట్టాల పటిష్ఠతకు తిరుపతి వేదికగా నిర్వహించిన జాతీయ కార్మిక సదస్సు దోహదపడుతుందని సీఎం జగన్ అన్నారు. తిరుపతిలో 47వ జాతీయ కార్మికశాఖ సదస్సు జరిగింది. ఈ సదస్సును ఉద్దేశించి శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రసంగించారు. ఈ సదస్సు ద్వారా చేసిన మేధోమథనం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తిరుపతిలో జరుగుతున్న ఈ సదస్సుకి ముఖ్యులంతా రావడం సంతోషకరమని, ఒక జాతీయ సదస్సుకి తిరుపతిని వేదికగా చేసిన కేంద్రమంత్రి భూపేందర్‌యాదవ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని, సదస్సుకి వచ్చిన అందరికీ తిరుమల బాలాజీ దీవెనలు ఉంటాయని భావిస్తున్నానన్నారు. రెండు రోజులుగా ఈ సదస్సులో చర్చించిన అంశాలు కార్మిక చట్టాల పటిష్టతకు మరింతగా ఉపయోగపడతాయని భావిస్తున్నానని చెప్పారు. పారిశ్రామికవేత్తలకు, కార్మికులకు మేలు చేసేలా కార్మిక చట్టాల రూపకల్పన, బలోపేతంలో ఈ సదస్సు ద్వారా చేసిన మేధోమథనం ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో సదస్సు జరగడం సంతోషకరమని, అంతేకాక ఇది గౌరవంగా భావిస్తున్నామని చెప్పారు. సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ, సీఎంవో అధికారులు హాజరయ్యారు.

ఏ కొండూరు మండలంలో మరణమృదంగం

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ఏ కొండూరు: ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల మరణ మృదంగం మోగుతూనే ఉంది. ప్రతి రెండు రోజులకూ ఏదోచోట కట్టె కాలుతూనే ఉంది. ప్రభుత్వం మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో తండా ప్రజలు భయంతో వణికిపోతున్నారు. తమ మండలంలోనే ప్రజలు కిడ్నీ బారిన ఎందుకు పడుతున్నారో వైద్యులు సైతం నిర్ధారించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, మాధవరం గ్రామానికి చెందిన నీలపాల వెంకటేశ్వరరావు (60) గురువారం రాత్రి కిడ్నీ వ్యాధితో విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తమ తండ్రి గత మూడు సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని మృతుడి కుమారుడు గోపిరాజు తెలిపాడు. కొద్దిరోజుల క్రితం వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించామని, సుమారు రూ.3 లక్షలు వరకు ఖర్చు చేశామని చెప్పాడు. అయినా తండ్రి దక్కలేదని కన్నీరు మున్నీరుగా విలపించాడు. బాధిత కుటుంబానికి మట్టి ఖర్చులు నిమిత్తం మాధవరం సర్పంచ్ కుక్కల వెంకట సీతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మారిపోగు అనూష రూ.15 వేలు ఆర్థికసాయం చేశారు. వీఆర్వో జీ రవి మృతదేహాన్ని పరిశీలించారు. వైసీపీ నాయకులు కే వైకుంఠరావు, ఎమ్. మహేష్ బాధిత కుంటుబానికి సానుభూతి తెలిపారు.

సంపాదకీయం

స్ఫూర్తితో సరితూగని పని తీరు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులు బయట సభల్లో సమావేశాల్లో చాలా ఉదారంగా, కొన్ని సార్లు విప్లవాత్మకంగా మాట్లాడతారు. అలాంటి ప్రసంగాలు విన్నప్పుడు వారికి ఎంత నిబద్ధత ఉందో అని ఆశ్చర్యపోతూ ఉంటాం. కానీ న్యాయ నిర్ణయ పీఠం మీద ఉన్నప్పుడు చాలా మంది న్యాయమూర్తుల్లో ఈ ధోరణి కనిపించదు. శుక్రవారం పదవీ విరమణ చేసిన ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ సైతం దీనికి అతీతం కాదు అనిపించారు. కోర్టు వెలుపల ఆయన మాటలు చాలా స్ఫూర్తిదాయకంగా, ఉద్వేగభరితంగా ఉండేవి. పౌరుల హక్కుల గురించి, రాజకీయ వ్యవస్థలో ప్రతిపక్షాలు అంతకంతకూ బలహీనపడడం ప్రజాస్వామ్యానికి చేటు తెస్తుంది అని ఆయన అన్నప్పుడు ఆయన హయాంలో వీటికి రక్షణ ఉంటుందని అనుకున్నాం. న్యాయ స్థానాల్లో జడ్జీలను సమయానికి నియమించనందుకు, న్యాయవ్యవస్థకు మౌలిక సదుపాయాలు కొరవడుతున్నందుకు, కేసులు పేరుకు పోతున్నందుకు న్యాయమూర్తి రమణ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ధోరణిలోనే మాట్లాడారు. సమాజంలోని బలహీన వర్గాలకు న్యాయం అందాలని పదే పదే చెప్పారు. దేశద్రోహ చట్టం గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఆచరణలో మార్పు వస్తుందన్న ఆశ చిగురింప చేశాయి. కానీ ఆ కిరాతక చట్టం అలాగే ఉంది. అంతకు ముందు ప్రధాన న్యాయమూర్తులుగా ఉన్న దీపక్ మిశ్రా, రంజన్ గొగోయ్, ఎస్.ఎ.బోబ్డే హయాంలో జరగని న్యాయం జరుగుతుం దనుకున్నాం. కానీ ఆయన ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన 16 నెలల కాలంలో ఇచ్చిన తీర్పులు ఆ ధోరణిలో లేవు. కీలకమైన చాలా కేసులను ఆయన హయాంలో పరిష్కరించకుండానే వదిలేశారు. చాలా ముఖ్యమైన, రాజ్యాంగపరమైన కేసులను ముట్టుకోనే లేదు. మహారాష్ట్రలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం, ప్రధాని పంజాబ్ పర్యటనలో భద్రతా లోపం, హిజాబ్ పై కర్నాటక హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ లాంటివి కూడా న్యాయమూర్తి రమణ పదవీకాలంలో చర్చకే రాలేదు. కశ్మీర్ కు వర్తించే 370వ అధికరణం రద్దు, పౌరసత్వ సవరణ చట్టం లాంటి కీలకమైన అంశాలను విచారిస్తామని ఆయన ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదు. ప్రజల ప్రాథమిక హక్కులకు రమణ పూచీ పడతారన్న ఆశా నెరవేరలేదు. హరిద్వార్ ధర్మ సన్సద్ లో విద్వేష ప్రసంగం చేసి మైనారిటీలలో అభద్రతను సృష్టించిన వ్యక్తికి మాత్రం సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేసింది. భీమా కోరేగావ్ కేసులో అనేకమంది ప్రముఖులు నాలుగేళ్లుగా నిర్బంధంలోనే ఉన్నారు. ఈ విషయం చర్చకే రాలేదు. ఈ కేసులో నిందుతుడైన స్టాన్ స్వామి నిర్బంధంలోనే ప్రాణాలు విడిచినా ఈ కేసును సత్వరం విచారించడానికి ప్రయత్నమే జరగలేదు. పైగా గుజరాత్ మారణ కాండ కేసులో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యల ఆధారంగా పౌర హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్ ను జైలులో పెడ్తే సుప్రీంకోర్టు చలించనే లేదు. గిరిజనులను చట్టబాహ్యంగా ఎన్ కౌంటర్లలో హతమార్చడాన్ని సవాలు చేస్తూ హిమాంశు కుమార్ పెట్టుకున్న పిటిషన్ తో మేలు జరగకపోగా న్యాయమూర్తులు ఎ.ఎం. ఖాన్విల్కర్, జె.బి.పార్దీవాలా పిటిషనర్ కు అయిదు లక్షల రూపాయల జరిమానా విధించడం దిగ్భ్రాంతి కలిగించింది. ఈ తీర్పుతో న్యాయమూర్తి రమణకు సంబంధం లేకపోవచ్చు కానీ ఆయన హయాంలో వెలువడిందే. డబ్బు అక్రమ చెలామణిని నిరోధించే చట్టాన్ని (పి.ఎం.ఎల్.ఎ.) ప్రభుత్వం విపరీతంగా దుర్వినియోగం చేస్తోంది. ప్రతిపక్షాలను అణచడానికి వినియోగిస్తోంది. 2011 తరవాత ఈ చట్టం కింద నిర్బంధానికి గురి అవుతున్న వారి సంఖ్య మూడు రెట్లు పెరిగింది. 2019 లో ఈ చట్టాన్ని సవరించి కొత్త కోరలు సమకూర్చినప్పటినుంచి ప్రతిపక్షాన్ని అణగదొక్కడానికి ఇది బ్రహ్మాస్త్రంలా ఉపయోగపడ్తోంది. ఈ కేసుల్లో శిక్ష పడింది మాత్రం తొమ్మిది మందికే. ఈ చట్టాన్ని సవాలు చేస్తే సుప్రీంకోర్టు ఆ కిరాతక చట్టాన్నే సమర్థించింది. ఇది న్యాయమార్గ పాలనను మంటగల్పుతోంది. ఈ కేసూ న్యాయమూర్తి రమణ హయాంలో తేలనే లేదు.

రాజకీయ నాయకులు, పత్రికా రచయితలు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉన్నతాధికారులు ఇలా అనేక మంది మీద నిఘా వేయడానికి ప్రభుత్వం పెగాసస్ అనే సాఫ్ట్ వేర్ ను వినియోగిస్తోందన్న కేసు న్యాయమూర్తి రమణ పదవీ విరమణ చేయడానికి ఒక రోజు ముందు ప్రస్తావనకు వచ్చింది. కానీ గురువారం జరిగిందల్లా పెగాసస్ పై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రవీంద్రన్ నాయకత్వంలో నియమించిన కమిటీ నివేదికను ప్రస్తావించడంతోనే సరిపోయింది. ఈ కమిటీ నివేదికలో కొత్తగా తెలిసిన విషయమల్లా ప్రభుత్వం ఈ కమిటీకి సహకరించలేదనే. నిజానికి ఇదీ కమిటీ కనిపెట్టిన బ్రహ్మ రహస్యమేమీ కాదు. ఇదివరకు సుప్రీంకోర్టులో పెగాసస్ ప్రస్తావన వచ్చినప్పుడు ప్రభుత్వం ఏ ప్రశ్నకూ సమాధానం ఇవ్వడానికి ఒప్పుకోలేదు. దేశ భద్రత చాటున గూఢచర్యాన్ని కప్పిపుచ్చుకుంది. కనీసం ప్రమాణ పత్రం (అఫిడవిట్) దాఖలు చేయడానికీ మోదీ సర్కారు అంగీకరించలేదు. ఒత్తిడి చేసిన తరవాత దాఖలు చేసిన పరిమితమైన అఫిడవిట్ లోనూ అసలు విషయం చెప్పనే లేదు. వివరమైన అఫిడవిట్ దాఖలు చేయడం కుదరదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెగేసి చెప్పారు. సుప్రీంకోర్టు కిమ్మనలేదు. పైగా పెగాసస్ రగడపై దర్యాప్తు చేయడానికి బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఓ విచారణా సంఘాన్ని నియమిస్తే ఆ సంఘం పని చేయడానికి వీలులేదని సుప్రీంకోర్టు ఆదేశించింది న్యాయమూర్తి రమణ హయాంలోనే. పెగాసస్ వాడారా లేదా అన్న ఒకే ఒక్క ప్రశ్నకు కూడా అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వం నుంచి సమాధానం రాబట్టలేకపోయింది. సమాధానం ఇవ్వకపోవడమే ప్రభుత్వం పెగాసస్ ను వినియోగిస్తుందనడానికి తార్కాణం అయినా చేసిందేమీ లేదు. అయితే ఈ కేసు విచారణ పూర్తి కాలేదు కనక మోదీ సర్కారు బోనులోంచి బయటపడ్డట్టు కాదు. పౌరుల హక్కులను కాల రాస్తుంటే సుప్రీంకోర్టు నిశ్చేష్టంగా మిగిలిపోవడం ఆందోళన కలిగిస్తోంది. 370వ అధికరణం, పౌరసత్వ సవరణ చట్టం ప్రధాన న్యాయమూర్తి లలిత్ పదవీ కాలంలో తేలే అవకాశాలు తక్కువ. న్యాయమూర్తి రమణ హయాంలో జరిగిందల్లా న్యాయవ్యవస్థకు కొన్ని మౌలిక సదుపాయాలు సమకూరాయి. దాదాపు 11 మంది న్యాయ మూర్తులను నియమించగలిగారు. హైకోర్టుల్లోనూ ఖాళీలు తగ్గాయి. అన్నింటికన్నా మించింది ముగ్గురు మహిళలు సుప్రీంకోర్టు న్యాయ మూర్తులయ్యారు. ఉపన్యాసాలకు తీర్పులకు సంబంధం ఉండదన్న అపప్రథను న్యాయమూర్తి రమణ కూడా తొలగించలేకపోయారు. ఆయన ఆలోచనలు ఆచరణలోకి రాకపోవడం నిరాశనే మిగులుస్తుంది. హక్కులకు భంగం కలిగించే చర్యలు నిరాఘాటంగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలగకుండా చూడడం, రాజ్యాంగ పరిరక్షణ, న్యాయమార్గ పాలన కొనసాగేట్టు చూడడమూ సుప్రీంకోర్టు బాధ్యతే. ప్రజలకు ఆఖరి దిక్కు అత్యున్నత న్యాయస్థానమే అన్న భరోసా స్ఫూర్తిదాయకమైన న్యాయమూర్తి హయాంలో కూడా కలగకపోవడం పెద్ద లోటే.

అవార్డులోయ్.. అవార్డులు...

నాలుగు రోజుల క్రితం ఏడుకొండలు నా దగ్గరికి హడావుడిగా వచ్చాడు. వైట్ అండ్ వైట్‌లో మెరిసిపోతున్నాడు. వాడి ముఖం చాలా ఆనందంగా వెలిగిపోతోంది. "అంత ఆనందంగా ఉన్నావు. ఏమిటి విశేషం అని అడిగా". "ఆనందం కాక ఇంకేమిటిరా" ... అంటూ "నీ మీద కోపం వచ్చింది" అని కూడా అన్నాడు. "కోపం కాకపోతే ఇంకేమిటి. నాకు మన ఊర్లో ఉత్తమ సేవా పురస్కారం ఇచ్చారు. నువ్వు ఒక్క ముక్క కూడా రాయలేదు నా గురించి" అని అలిగిన ముఖం పెట్టాడు. మళ్లీ వాడే "నాకు అవార్డు వచ్చినందుకు పార్టీ కూడా ఇచ్చా. దానికీ రాలేదు నువ్వు" అన్నాడు. "నన్ను పిలవ లేదుగా" అన్నాను. "అదేవిట్రా... మీ విలేకరుల గ్రూపులో పెట్టానుగా విందుకి రండి. తిని పొండి అని" అన్నాడు. " నేను ఆ గ్రూప్‌లో లేను. అందుకే తెలియలేదులే. సర్లే. ఏమిటి సంగతి పొద్దున్నే వచ్చేసావ్" అన్నాను. ఏడుకొండలు నా చిన్ననాటి క్లాస్‌మేట్. మధ్యలో చదువు ఆపేసి చిన్న చిన్న పనులతో జీవితాన్ని ప్రారంభించాడు. అలా

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

అలా ఎదిగి ఇప్పుడు సొంత ఊర్లోనే కాంట్రాక్టర్‌గా పనులు చేస్తున్నాడు. ఏమాటకామాటే చెప్పుకోవాలి. కష్టజీవి. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాలకు ఏడుకొండలకి ఉత్తమ సేవా పురస్కారం ఇచ్చారు.

అదిగో దాని తర్వాత మళ్లీ ఇప్పుడే కలిసాడు. చేతిలో ఓ పేపర్ ఉంది. దాన్ని తీసి "ఇది చదువు" అన్నాడు. చదివాను. అది కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులకు అర్హులనుకున్న వారు దరఖాస్తు చేసుకో మంటూ వచ్చిన ప్రకటన. అదే విషయం చెప్పాను ఏడుకొండలకి. "నాకు తెలుసురా. నేను దరఖాస్తు చేద్దామనుకుంటున్నాను. నా గురించి నువ్వు దరఖాస్తు రాయాలి. నువ్వు బాగా రాస్తావని నీ దగ్గరకి వచ్చాను" అన్నాడు. నేను నవ్వేసి... "ఇలా అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోకూడదురా. తప్పు. మనం చేసినపనిని ప్రభుత్వాలు గుర్తించి అవార్డులివ్వాలి" అన్నాను. " నిజమే... కాని వాళ్లే దరఖాస్తు చేసుకోమన్నారు కదా" అన్నాడు అమాయకంగా. "మన ఖర్మ. ప్రభుత్వాలు అలా తగలడ్డాయి" అన్నాను ఆవేశంగా. "వాళ్లే అలాఉన్నప్పుడు మనంచేస్తే తప్పేంటి" అన్నాడు లాజిక్ తీస్తూ...

"సర్లే... అప్లికేషన్ రాస్తానులే" అని రాయడం ప్రారంభించాను.

" అవునూ... ఈ భారతరత్న అని ఇస్తారు కదా... దానికి కూడా దరఖాస్తు చేసుకునేలా చేయచ్చు కదా" అన్నాడు పక్కనే కూర్చున్న ఏడుకొండలు. "అంటే దానికి కూడా దరఖాస్తు చేసేస్తావా" అని కంగారుగా అడిగా. "అది కాదురా... పి.వి.నర్సింహారావు ఆర్థిక సంస్కరణలు చేసినట్లు అవార్డులు కూడా సంస్కరిస్తే బాగుంటుందని" అన్నాడు. " భారతరత్న వంటివి మహానుభావులకు, దేశ ప్రతిష్టని ఇనుమడింప చేసిన వారికి ఇస్తారు. దాన్నీ సంస్కరించమంటున్నావా నువ్వు" అన్నాను. "నీకు ఈసారి పద్మశ్రీ వచ్చేస్తుందను కుంటున్నావా.." అని అడిగా భయం భయంగా. "అబ్దుల్ కలామ్ ఏమన్నారు... కలలు కనండి. సాధించండి అన్నారు కదా. మనం కలలు కంటున్నాం. సాధించేందుకు ప్రయత్నం చేస్తున్నాం" అన్నాడు ఏడుకొండలు. ప్రయత్నం అంటే అని అనుమానంగా అడిగాను. అంటే మన మున్సిపాలిటీలో ఓ పెద్దాఫీసురు ఉన్నారులే. ఆయనకి ఢిల్లీలో చాలా పరిచయాలున్నాయట. "నువ్వు దరఖాస్తు చేయి. నే చూసుకుంటా" అన్నారు ఆయన అని చావు కబురు చల్లగా చెప్పాడు.

" ఓ అలోచనరాగా... భారతరత్న అని ఏడాదికో, రెండేళ్లకో ఒక్కరికే ఇవ్వకుండా దాన్ని విడదీసేసి తెలంగాణా రత్న అని ఆ రాష్ట్రంలో గొప్పోడికి, ఆంధ్ర రత్న అని మన రాష్ట్రంలో గొప్పోడికి, జిల్లా రత్న అని జిల్లా పేరుతో ఇక్కడి వాళ్లకి ఇవ్వచ్చు కదా అని ఓ సలహా" అన్నాడు.

మళ్లీ వాడే "విశాఖ రత్న సింహాచలం గారు ఎంత బాగుందో కదా... చిత్తూరు రత్న సుబ్బారెడ్డి గారు భేషుగ్గా లేదూ... కోనసీమ రత్నఏడుకొండలు గారు మహదానందంగా ఉంది కదా... అలా అన్నమాట" అన్నాడు. ఆ మాట పూర్తి అయ్యిందో లేదో నా కళ్లు తిరగడం ప్రారంభమయ్యాయి. మరో మూడు నిమిషాల తర్వాత నేల మీద పడి గిలగిలా కొట్టుకున్నానని ఆ మర్నాడు మా అమ్మాయి చెప్పింది పాపం భయం, భయంగా...

వ్యాస రచయిత సెల్: 99120 19929

ప్రజాస్వామ్య రక్షణ దిశగా సిపిఐ సభల్లో చర్చ

చలసాని వెంకట రామారావు

భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర 26 వ మహాసభ 2018 ఏప్రిల్ 7-9 తేదీలలో కడప పట్టణంలో జరిగింది. దేశం కరోనా సంక్షోభం కారణంగా 27 వ రాష్ట్ర మహాసభలు ఆలస్యంగా విశాఖపట్నంలో జరుగుతున్నాయి. అభివృద్ధి, సంక్షేమం ప్రజాస్వామ్యం పరిరక్షణ లక్ష్యంగా ఈ సభలు చర్చిస్తున్నాయి. గత మహాసభ కాలంలో రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉంది. అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడంతో 2019 ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయింది. వై.ఎస్.జగన్ నాయకత్వంలో నూతన ప్రభుత్వం 151 సీట్లు సాధించి అధికారం చేపట్టింది. ఎన్నికల ముందు జగన్ ఎన్నో హామీలు గుప్పించారు. అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తానని నమ్మబలికారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్రం తుంగలో తొక్కివేసినా జగన్‌రెడ్డి మౌనంగా ఉన్నారు. తనపై ఉన్న కేసులను దృష్టిలో ఉంచుకుని కేంద్రం తనపై ఉక్కుపాదం మోపకుండా వారికి సహకారం ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో జగన్ ఉన్నారు. దీనివలన విభజన హామీలైన ప్రత్యేక హోదా, లోటు బడ్జెట్ భర్తీ, కడప స్టీల్‌ప్లాంట్, వెనుకబడిన జిల్లాల ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్ వంటి సమస్యలు అటకెక్కాయి.

జగన్ మూడేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి అధ్వాన్న స్థాయికి దిగజారింది. గత ప్రభుత్వ కాలంలో చేసిన పనులకు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం తీసుకునే అభివృద్ధి పనులను చేసేందుకు కాంట్రాక్టర్లెవ్వరు ముందుకు రావటం లేదు. గతంలో పనులు చేసి బిల్లులు రాక అప్పుల వాళ్ల బాధ భరించలేక కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కూడా రాష్ట్రంలో ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి ఉంది. తరుచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గత సంవత్సర కాలంగా ప్రభుత్వం రోడ్ల అధ్వాన్న పరిస్థితిని చక్కదిద్దటంలో విఫలమైంది. వీరి పాలనలో నిర్మాణరంగం కుదేలు అయ్యింది. ఇసుక నూతన పాలసీ పేరుతో సంవత్సరం పైగా ఇసుక సరఫరా నిలిపివేవారు. వేలాది మంది నిర్మాణ కార్మికులు పనులు లేక పస్తులతో జీవితాలు నెట్టుకువచ్చారు. బలహీన వర్గాల గృహ నిర్మాణం కూడా మందకొడిగా సాగుతున్నది. ప్రభుత్వం ఇచ్చే నామమాత్రం సాయం (1.8 లక్షలు) ఏమాత్రం ఇళ్ల నిర్మాణానికి సరిపోవటంలేదు. ఇంటి శ్లాబుల నిర్మాణానికి అవసరమైన ఇనుము ధర టన్ను 90 వేలకు పైగా అమ్మటం జరిగింది. జగన్ పాలనలో రాష్ట్రానికి ఒక్క విదేశీ ప్రాజెక్టుగాని, పరిశ్రమ గాని రాలేదు. దావోస్ అంతర్జాతీయ సదస్సులో ముఖ్యమంత్రి స్వయంగా పాల్గొని పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక సమావేశం జరిపి ఎన్ని హామీలు ఇచ్చినా ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదు. జగన్‌మోహన్‌రెడ్డి కక్షపూరిత వైఖరి వల్ల ఉన్న పరిశ్రమలు కూడా బయటి ప్రాంతాలకు తరలిపోతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో ప్రారంభించి అసంపూర్తిగా నిలిచిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు. వీటి నిమిత్తం అప్పులు చేసి ప్రభుత్వానికి చెల్లించిన లబ్ధిదారులు ఇటు ఇళ్లురాక, అటు అప్పులకు వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్రంలో జగన్ పాలన అభివృద్ధి దిశగా కాకుండా అప్పుల దిశగా పనిచేస్తున్నది. రాష్ట్రం విడిపోయిన 2014 జూన్ 2 న ఉమ్మడి రాష్ట్రం నుండి 96 వేల కోట్లు అప్పు మన రాష్ట్రం వాటాగా వస్తే టిడిపి ప్రభుత్వం అప్పులతో సహా ప్రస్తుతం రాష్ట్రం అప్పులు ఎనిమిది లక్షల కోట్లకు చేరుకుంది. రానున్న రెండు సంవత్సరాల పదవీ కాలంలో ఇది పది లక్షల కోట్లకు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే రాష్ట్ర జనాభాలో తల ఒక్కింటికి 2 లక్షల అప్పు మిగులుతుందన్న మాట. అప్పులు ఇబ్బడిముబ్బడిగా చేసినప్పటికీ ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టుగాని, కాల్వల మరమ్మత్తులుగాని చేయలేదు. వ్యవసాయ రంగంలో అభివృద్ధి స్తంభించిపోయింది. సూక్ష్మ సేద్య పరికరాలకు సబ్సిడీ ఎత్తివేశారు. పోలవరంప్రాజెక్టు పని నత్తనడకన నడుస్తున్నది. ఐ.టి. రంగంలో అనేక సంస్థలు పక్కరాష్ట్రాలకు తరలిపోతున్నాయి. రాష్ట్రరాజధాని అమరావతిలో 54వేల ఎకరాలభూమి ఉన్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. నిర్మాణంలో ఉన్న భవనాల పనులు అర్ధంతరంగా ఆపి వేశారు. రాష్ట్రంలో 2 లక్షల 35 వేల ఉద్యోగాల ఖాళీలు ఉంటే, 10,173 ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారు. నిరుద్యోగ సైన్యం వేగంగా పెరుగుతున్నది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు తుమ్మితే ఊడే ముక్కులా తయారయ్యాయి. కనీస వేతనాలు ఎండమావుల్లా ఉన్నాయి. 73 షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్‌లో 15 సంవత్సరాల నాటి వేతనాలే కొనసాగుతున్నాయి. కనీస వేతన సలహా సంఘమే రాష్ట్రంలో లేదు. గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయితీలకు కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించింది. దీనితో గ్రామాలలో అభివృద్ధిపనులు నిలిచిపోయాయి.

ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సంక్షేమపథకాలకు కత్తెరవేయటం ప్రారంభమైంది. ఆర్భాటంగా ప్రారంభించిన 'అమ్మ ఒడి' పథకం అమలుకు అనేక ఆంక్షలు విధించి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించారు. అభివృద్ధి పథకాలకు కరంటు బిల్లులకు ముడిపెట్టారు. మూడు వేలు పింఛను మూడునాళ్ల ముచ్చటగా మారిపోయింది. ఆశా వర్కర్లు, హోమ్ గార్డుల వేతనాలు పెంచినా పెరిగిన ధరవరలలో వారి నిజ వేతనాలు తరిగి పోయి, పని భారం పెరిగి అల్లాడుతున్నారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసినా, కార్మికులు ఉన్న సౌకర్యాలు, హక్కులు కోల్పోయారు. మద్యపాన నిషేధం అంటూ చేసిన వాగ్దానం ఆచరణలో అమలు కాకపోగా మద్యం ధరలు పెరిగి నాణ్యతలేని మద్యం ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ మద్యం పాలసీ వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయి. ధరల స్థిరీకరణ వాగ్దానం గాలికిపోయి ప్రజల కొనుగోలు శక్తి తరిగిపోయింది. రైతులకు ఉద్దేశించిన వైఎస్సార్ రైతుబీమా ఆచరణలో ఏ ఒక్క రైతుకు ఉపయోగపడింది లేదు. విద్యా రంగంపై చేసిన వాగ్దానాలను విస్మరించి చాలా పాఠశాలలను రేషనలైజేషన్ పురుతో మూసివేసి, పేద వర్గాలకు ప్రాథమిక విద్యను దూరం చేస్తున్నారు. సంక్షేమం- అభివృద్ధి సమపాళ్లలో ఉంటేనే రాష్ట్రం ముందుకు వెళుతుంది. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షోభం పేరుతో లక్షల కోట్లు అప్పులు చేసి, వాటిని అవసరమైన మేరకు వినియోగించకుండా దుర్వినియోగం చేస్తున్నారు.

రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయి. అధికార పార్టీ నాయకులు అధికార మదంతో తాము ఏమి చేసినా ఎదురులేదనే భావనతో మితిమీరి వ్యవహరిస్తున్నారు. ఒక అధికార పార్టీ ఎం.ఎల్.సి. దళిత యువకుడైన తన కారు డ్రైవరును కొట్టి చంపి తన కారులోనే శవాన్ని యింటికి డెలివరీచెయ్యటం జరిగింది. అటువంటి ఘటనలు గతంలో ఎరుగం. అయినా జిల్లా పోలీసు అధికారి ఎం.ఎల్.సి, ని వెనకేసుకు రావటం ప్రజాస్వామిక వాదులకు విడ్డూరంగా కన్పించింది. ఇక ప్రజా సమస్యలపై నిత్యం గళమెత్తే వామపక్ష ఉద్యమాల పట్ల క్రూరమైన వైఖరిని ప్రభుత్వం తీసుకుంటున్నది. విజయవాడలో ప్రదర్శనలకు, ధర్నాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వటంలేదు, ఇచ్చినా హౌస్ అరెస్టుల పేరుతో నిర్బంధాలు విధిస్తున్నారు. ముఖ్యమంత్రి జిల్లాలకు వెళితే వామపక్ష నాయకుల అరెస్టులకు ప్రభుత్వం పూనుకుంటున్నది.అక్రమంగా కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. చివరకు హాలులో నిర్వహించే సంస్థాగత సమావేశాలలో కూడా కార్యకర్తలు పాల్గొనకుండా నిరోధిస్తున్నారు. అనుమతి లేకుండా పార్టీ కార్యాలయాలలోకి, ప్రజా సంఘాల కార్యాలయాలలోకి పోలీసులు చొరబడి అరెస్టులకు పాల్పడుతున్నారు. ప్రజాస్వామ్య విలువలను, సాంప్రదాయాలను తుంగలో తొక్కి నియంతృత్వ ధోరణిలో ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

రాష్ట్రంలో అభివృద్ధి- సంక్షేమం ప్రజాస్వామ్యం పట్టపగలే ఖూనీ అవుతున్న క్రమంలో సి.పి.ఐ. రాష్ట్ర 27 వ మహాసభలు విశాఖ సాగర తీర నగరంలో జరగనున్నాయి. రాష్ట్రంలోని పరిస్థితులను చర్చించి సి.పి.ఐ. మహాసభలు అనేక తీర్మానాలను ఆమోదించనున్నాయి. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలపై సమర శంఖం పూరించే దిశలో ఈ చర్చలు జరగనున్నాయి. రానున్న రోజుల్లో వామపక్ష, లౌకిక, ప్రజాస్వామిక శక్తుల ఐక్యతను బలోపేతం చేయటం ద్వారా ప్రభుత్వ, పాలక పార్టీల నిరంకుశ, పక్షపాత, అవినీతి చర్యలను దునుమాడడమే లక్ష్యంగా సి.పి.ఐ రాష్ట్రంలో కృషి చేయనుంది.

(సి.పి.ఐ. రాష్ట్ర 27 వ మహాసభల సందర్భంగా)

వ్యాస రచయిత సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, సెల్: 9490952093

ధరలు, ద్రవ్యోల్బణంపై నోరు విప్పరా.. మోదీజీ!

ఎం కోటేశ్వరరావు

అదుపుగాని ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం గురించి ప్రధాని నరేంద్రమోదీ ఆందోళన చెందుతున్నారా? జనానికి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నా ఇంతవరకు వాటి గురించి ఎందుకు నోరు విప్పటం లేదు? జులై నెలలో చిల్లర ద్రవ్యోల్బణం గత ఐదు నెలల కనిష్ట స్థాయి 6.71 శాతానికి తగ్గిందన్నది ప్రభుత్వ ప్రకటన. అనేక మంది హమ్మయ్య అని కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఎందుకు అంటే ఆహారం, మరికొన్ని వస్తువుల ధరలు కాస్త తగ్గటమే కారణం. ద్రవ్యోల్బణాన్నే ధరల పెరుగుదల సూచికగా కూడా తీసుకోవచ్చు. సూచిక తగ్గుదల-పెరుగుదలను ఎలా చూడాలి. జూన్ నెలలో ఇది 7.1 శాతంగా ఉన్నది జులైలో 6.71కు తగ్గింది. ద్రవ్యోల్బణం లెక్కింపుకు వంద వస్తువుల ధరలను ప్రమాణంగా తీసుకుంటే వాటి ధర రు 100 అనుకుంటే జూన్ నెలలో పెరుగుదల ప్రకారం రు.107.10కి పెరిగితే జులైలో రు.106.70 ఉంటుంది. అంటే నలభై పైసలు తగ్గింది. వంద వస్తువుల్లో కొన్నింటి ధర సగటు కంటే తగ్గవచ్చు, కొన్ని పెరగవచ్చు. ఇలా పన్నెండు నెలల వివరాలను సగటుగా తీసుకొని వార్షిక ద్రవ్యోల్బణాన్ని ఖరారు చేస్తారు. ఈ మేరకు 2014 నుంచి 2021 వరకు ఎనిమిదేండ్ల సగటు 4.87శాతంగా ఉంది. ప్రభుత్వం నిర్దేశించుకున్న నాలుగుశాతం లోపు మూడు సంవత్సరాల్లో మాత్రమే ఉంది. తగ్గుదలకు కారణం తమ ప్రతిభే అనుకుంటే పెరుగుదల కీర్తి కూడా వారిదే మరి !

ద్రవ్యోల్బణం నాలుగు శాతంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆర్‌బిఐని ఆదేశించింది. షరతులు వర్తిస్తాయి అన్నట్లుగా దానికి రెండు శాతం అటూ ఇటైనా ఫరవాలేదని చెప్పింది. అంటే ఏటా నాలుగు నుంచి ఆరుశాతం మేరకు ధరలను పెరగనివ్వవచ్చు అన్నది ప్రభుత్వ విధానం. ఇప్పుడు పెరిగిన ద్రవ్యోల్బణం ప్రపంచమంతటా ఉన్నదే తప్ప మా లోపం ఏమీ లేదు అని సరికొత్తగా సమర్ధించుకుంటున్నారు. ఎనిమిదేండ్ల క్రితం ఏం చెప్పారో వారు వెనక్కి తిరిగి చూసుకోవాలి. మన కాషాయ దళాలు, వాటికి వంతలుగా ఉన్న మీడియా ప్రపంచమంతటా ద్రవ్యోల్బణం పెరుగుతోందని చెబుతాయి. ఇది జనాన్ని పూర్తిగా తప్పుదారి పట్టించటం తప్ప తర్కానికి నిలిచేది కాదు. దీనికి కారణాలేమిటి? ఒక్కొక్క దేశంలో ఒక్కో కారణం తప్ప అన్ని దేశాలకూ ఒకే కారణం ఉండదు. బిజెపి వారు చెబుతున్నట్లు అంతటా ఒకటే అంటే శ్రీలంకలో మాదిరి మన దగ్గర కూడా పెరగాలి కదా ! గతేడాది జులైతో పోలిస్తే లంకలో 2022 జులై ద్రవ్యోల్బణం రేటు 60.8 శాతం ఉంది. వెనెజులాలో కొన్ని సంవత్సరాలుగా తలెత్తిన ద్రవ్యోల్బణం కొన్ని వేల శాతం పెరిగి జులై నెలలో 7.5శాతానికి తగ్గినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. ఈ ఏడాది తొలి ఆరుమాసాల్లో చైనాలో సగటున నెలవారీ ధరల పెరుగుదల 1.7శాతం, ఏడాదిలో మూడుశాతానికి పెరగవచ్చని అంచనా. ఒక్క ఈ సంవత్సరమే కాదు, గత పది సంవత్సరాల్లో ఒక్క ఏడాది తప్ప రెండు శాతానికి మించి ధరల పెరుగుదల లేదు. విత్త సంబంధమైన ఉద్దీపన పథకాలను పెద్ద ఎత్తున అమలు జరపకపోవటమే ద్రవ్యోల్బణం అదుపులో ఉండటానికి కారణం. ఆహార స్వయం సమృద్ధి, వస్తువుల దిగుమతులు లేకపోవటం మరో కారణం. అయినప్పటికీ చైనాలో పరిమితంగా ద్రవ్యోల్బణం ఉండటానికి లేదా పెరగటానికి అది దిగుమతి చేసుకొనే చమురు, కొన్ని పరికరాలు, ఇతర ముడివస్తువుల ధరలు ప్రపంచ మార్కెట్లో పెరగటమే కారణం. మన దేశ స్థితి గురించి ఎవరి అంచనాలు వారు చెబుతున్నప్పటికీ అందరూ చెబుతున్నది ఒకటే అదేమిటంటే ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు శాతానికి తగ్గే పరిస్థితి లేదు.

దీని గురించి ప్రధానిగా నరేంద్రమోదీ ఎందుకు మాట్లాడటం లేదు అన్నది ప్రశ్న. 2004 నుంచి 2013 వరకు పదేండ్లలో సగటు వార్షిక ద్రవ్యోల్బణం 8.06 శాతం కాగా 2014నుంచి 2021 వరకు మోదీ ఏలుబడిలో 4.87శాతం ఉంది. గత రెండు సంవత్సరాలుగా పెరుగుతోంది, ఈ ఏడాది ఇప్పటివరకు ఎక్కువగా పెరిగింది. ఇక్కడ 2014 ఎన్నికలకు ముందు నరేంద్రమోదీ గుజరాత్ సిఎం లేదా బిజెపి నేతగా ఏం చెప్పారో గుర్తుకు తెచ్చుకోవాలి. నరేంద్రమోదీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో ఎవరైనా చూడవచ్చు. "ఇది ద్రవ్యోల్బణాన్ని ఓడించే

తరుణం, ఇది కాంగ్రెస్‌ను ఓడించే సమయం " అనే శీర్షిక కింద నరేంద్రమోదీ చెప్పిన మాటలు, సమాచారాన్ని ఉంచారు. "వంద రోజుల్లో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేస్తానని కాంగ్రెస్ చెప్పింది. వారి వాగ్దానాన్ని నిలుపుకోలేదు. ప్రజా విశ్వాసాన్ని వమ్ము చేసిన వారిని నమ్మవద్దు. ప్రధాని వాజ్‌పేయి, మొరార్జీ దేశాయి ప్రభుత్వాలు ధరలను అదుపు చేసినపుడు మనమెందుకు చేయలేము? 2014 లో అధికారానికి వచ్చే బిజెపి ప్రభుత్వం ఆ పని చేస్తుందని నేను మీకు హామీ ఇస్తున్నాను. లోపభూయిష్టమైన విధానాలు, సరైన ప్రణాళిక లేకపోవటమే దీనికి కారణం" అని నరేంద్రమోదీ చెప్పారు. ఇక్కడ గమనించాల్సిందేమంటే ఆ వెబ్‌సైట్ సమాచారం ప్రకారం 1998 లో అంటే వాజ్‌పేయి అధికారానికి వచ్చిన ఏడాది 13.1 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణాన్ని ఓడిన 2004 నాటికి 3.76 శాతానికి తగ్గించగా తరువాత వచ్చిన మన్మోహన్‌సింగ్ సర్కార్ 10.92 శాతానికి పెంచినట్లు పేర్కొన్నారు. 2004 ఎన్నికలకు ముందు కనిష్ట స్థాయికి ద్రవ్యోల్బణం చేరినందున వందరోజుల్లో దాన్ని ఇంకా తగ్గిస్తానని కాంగ్రెస్ చెప్పిందనటం ఒక పెద్ద అవాస్తవం. దేశం వెలిగిపోతోందంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసిన బిజెపి 2004 ఎన్నికల్లో దెబ్బతిన్నది.

ఇప్పుడు పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణాన్ని ఓడించాల్సిన అవసరం లేదని నరేంద్రమోదీ భావిస్తున్నారా? ధరల పెరుగుదల నివారణకు 2011 లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ వినియోగదారుల వ్యవహారాల మీద ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. దానికి గుజరాత్ సిఎంగా నరేంద్రమోదీ అధ్యక్షుడు. ఇతరసభ్యులుగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు ముఖ్య మంత్రులున్నారు. ఆ బృందం ఆచరణాత్మక చర్యలంటూ 64 అంశాలు, ఇరవై సిఫార్సులను చేసింది. ఇప్పుడు అలాంటి కమిటీ లేదు, పదేండ్ల నాటి సిఫార్సుల కట్టమీద దుమ్ము దులిపి ఒక్కసారి చదువుకున్నట్లు కూడా లేదు. కావాలనే వాటిని కూడా విస్మరించారా? లేక ఆ ఫైలు కనిపించలేదా ? పోనీ ఒకటవ తరగతి చదువున్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఆరేండ్ల పసిపిల్ల కీర్తిదూబే తన పెన్సిల్, ఎరైజర్ పారవేసుకుంటే తన తల్లి కోప్పడటం, మాగీ ధరల పెరుగుదల గురించి రాసిన లేఖ గురించి తెలిసిందే. దాని మీద ప్రధాని ఇంతవరకు స్పందించిన దాఖలా నాకు గూగుల్‌లోనూ కనిపించలేదు. ధరల గురించి ప్రధాని స్పందించలేదంటే రెండు కారణాలుండవచ్చు. ఒకటి చమురు ధరలు ఎంత పెరిగినా, పన్నులు ఎంత పెంచినా భరించిన జనం ఇతర వస్తువుల ధరలకు కూడా మెల్లగా అలవాటు పడతారు లెమ్మని కావచ్చు. తానే నోరు విప్పితే ధరలపెరుగుదలను అంగీకరించినట్లుఅవుతుంది, ఒకసారి అంగీకరించిన తరువాత తగ్గించేందుకు తీసుకున్న చర్య లేమిటనే చర్చ జనంలో ప్రారంభం అవుతుంది. ప్రజల ఆందోళనల కన్నా వారిలో ఇలాంటి ఆలోచనలు ప్రమాద కరమని భావించి మౌనంగా ఉంటున్నారని అనుకోవాలి. వరల్డ్ డాటా డాట్ ఇన్ఫో సమాచారంప్రకారం 1960నుంచి 2021వరకు ద్రవ్యోల్బణ సగటు 7.5శాతం కాగా కనిష్టం మైనస్ 7.6, గరిష్టం28.6శాతంగా నమోదైంది.1960 లో వంద రూపాయలకు వచ్చే సరకుల కొనుగోలుకు 2021 చివరిలో రు.7,804.85 చెల్లించాల్సి వచ్చింది. కనుక నరేంద్రమోదీ అచ్చేదిన్ ఏలుబడిలో 2014లో రు.100 విలువ గల వస్తువులు ఇప్పుడు రు.146.66కు గానీ రావటంలేదు. ద్రవ్యోల్బణం అంటే జనాల జేబులకు చిల్లు లేదా జేబులు కొట్టేసినట్లే !

హిమాచల్‌లో యాపిల్ రైతుల కన్నెర్ర

- ఎస్‌కేఎం ఆధ్వర్యంలో అదానీ కేంద్రాల ఘెరావ్
- రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసన
- తగ్గిన సేకరణ ధర... పెరిగిన సాగు వ్యయం
- సేకరణ ధర 30శాతం పెంపునకు డిమాండు

చండీగఢ్ : హిమాచల్ ప్రదేశ్ రైతన్న కన్నెర్ర చేశాడు. రేయింబవళ్లు కన్నబిడ్డలా సాకే పంటలకు తగిన ధరలు ఇవ్వకుండా చవకగా బడా వ్యాపారులు అనుసరిస్తున్న సేకరణ విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. రోడ్డుపైకి వచ్చి నిరసన వ్యక్తంచేశాడు. సేకరణ ధర పడిపోతుండటం, ఇన్‌పుట్ వ్యయాలు పెరిగిపోతుండటంపై మదన పడ్డాడు. పంట సేకరణ ధరలను కనీసం 30శాతం మేర పెంచాలని ముక్తకంఠంతో హిమాచల్ యాపిల్ సాగుదారులు డిమాండు చేశారు. ఇదే క్రమంలో అదానీ సంస్థకు చెందిన సేకరణ కేంద్రాలను ముట్టడించారు. 2020లో అదానీ సంస్థలు కిలో ప్రీమియం యాపిళ్లకు రూ.88 లెక్కన చెల్లించగా, రెండేళ్ల తర్వాత ధర రూ.76కి తగ్గించాయి. దీని ప్రభావం బహిరంగ మార్కెట్‌పై పడుతుండటంతో రైతన్నకు అన్యాయం జరుగుతోంది. దీంతో సేకరణ ధరలను కనీసం 30శాతం పెంచాలని యాపిల్ సాగుదారులు ఆందోళన బాట పట్టారు.

ఏడాది మొత్తం కంటికి రెప్పలా కాపాడుకునే యాపిల్ పంటను మార్కెట్ దిగ్గజాలు ఇంత తక్కువ ధరలకు కొనుగోలు చేయడం బాధాకరమని సిమ్లా జిల్లా, జుబ్బాల్‌లో యాపిల్ సాగుచేసే జగదీశ్ ఖింతా వాపోయారు. అదానీ గ్రూపు కారణంగా కేజీకి రూ.60-రూ.62కు మించి రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవడం దురదృష్టకరంగా పేర్కొన్నారు. ఓవైపు ఆదాయం తగ్గి, సాగు ఖర్చు పెరగటంతో సాగుదారులు తల్లడిల్లిపోతున్నారు. ప్యాకేజింగ్ సామాగ్రిపై జీఎస్టీ బాదుడు, ద్రవ్యోల్బణం కూడా సాగుదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో యాపిల్ సాగుదారులు తొలుత రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. ప్రొక్యూర్‌మెంట్ రేట్లను పరిశీలించాలని అదానీ గ్రూపుకు చెందిన అదానీ ఆగ్రో ఫ్రెష్‌కు అల్టిమేటం జారీ చేశారు.

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో సిమ్లా జిల్లాలోని రోహురు, రెవాలి, సైన్స్ ప్రాంతాల్లోని అదానీ గ్రూపుకు చెందిన మూడు ప్రొక్యూర్‌మెంట్ కేంద్రాలను రైతులు ఘెరావ్ చేశారు. ప్రొక్యూర్‌మెంట్ ధరలను తక్షణమే 30శాతం మేర పెంచాలని డిమాండు చేశారు. ప్రస్తుతానికి అదానీ ఆగ్రో ఫ్రెష్ రేట్లలో తేడాలు ఉన్నాయి. అత్యున్నత నాణ్యతగల యాపిల్స్ కేజీ రూ.76; సి గ్రేడ్ యాపిల్స్ కేజీకి రూ.15 చొప్పున చెల్లిస్తోంది. కేజీకి రూ.250 నుంచి రూ.300 వరకు కంపెనీ ఆఫ్‌సీజన్‌లోనూ ఆర్జిస్తుందని సాగుదారులు అంటున్నారు. పంటను సాగుదారుని ఎదుట తూకం వేయాలని కూడా వారు డిమాండు చేశారు.

ఎస్‌కేఎం కన్వీనర్ హరీశ్ చౌహాన్ మాట్లాడుతూ, ఆరు లక్షల టన్నుల మొత్తం పంట దిగుబడి నుంచి 25వేల టన్నుల కంటే ఎక్కువగానే అదానీ గ్రూపు దుకాణాలు సేకరిస్తూ ఉండవచ్చుగానీ వారు నిర్దేశించిన ప్రొక్యూర్‌మెంట్ ధరలే బెంచ్‌మార్క్‌గా మారి ప్రతి సంవత్సరం బహిరంగ మార్కెట్‌ను శాసిస్తుండటమే సమస్య అని అన్నారు. ఈ ఏడాది అదే జరిగిందన్నారు. ప్రీమియం యాపిల్స్ కేజీకి రూ.90 నుంచి రూ.100 వరకు లభించాల్సి ఉండగా అదానీ సంస్థ దానిని రూ.76కు పరిమితం చేసిందని చెప్పారు. పంట సాగు ధరలు ఆకాశాన్ని అంటుతుంటే అదానీ సంస్థ ప్రొక్యూర్‌మెంట్ ధరలు నేలచూపులు చూస్తున్నాయని విమర్శించారు. రైతుల ఆందోళనపై అదానీ ఆగ్రో ఫ్రెష్ అధికార ప్రతినిధి స్పందిస్తూ 'స్థానిక మండీలే ఈ ధరలు నిర్ణయించాయి. కంపెనీ దాని ప్రకారమే నడుచుకుంటోంది. సంయుక్త సమావేశాలప్పుడు రైతులతోనూ చర్చలు జరుపుతూ ఉంటుంది. ఆకర్షణీయమైన ధరలకే ప్రొక్యూర్‌మెంట్ చేస్తున్నాం' అని చెప్పారు. యాపిల్ సాగుదారులకు నాణ్యత, పారదర్శకంగా పంటను వేరు చేయడం, సత్వరమే చెల్లింపులు, ఎరువులు, తక్కువ ధరకు హైల్ నెట్లు వంటి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సీజన్‌లో ప్రొక్యూర్‌మెంట్ బాగా జరిగిందని, కేవలం పది రోజుల్లో 7,500 టన్నుల యాపిల్స్ సేకరించగా 25వేల టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

ఈ నెలారంభంలో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓ కమిటీని యాపిల్ సేకరణ ధరల ఖరారు కోసం ఏర్పాటు చేసింది. అందుకు చైర్మన్‌గా హార్టీకల్చర్, ఫారెస్ట్రీ యూనివర్సిటీ వీసీ వైఎస్ పర్మర్‌ను నియమించింది. కమిటి మొదటి సమావేశం ఈనెల 24న సిమ్లాలో అర్ధంతరంగా ముగిసింది. సమావేశమప్పుడు ప్రభుత్వాన్ని ఎస్‌కేఎం సభ్యులు నిలదీశారు. హిమాచల్ ప్రదేశ్‌లో ప్రొక్యూర్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు కోసం కోట్లల్లో సబ్సిడీలిస్తూ అదానీ గ్రూపు వంటి బడా కంపెనీలతో చేసుకున్న అవగాహన ఒప్పందాల ప్రతులను చూపాలని డిమాండు చేశారు. అలాంటి ఒప్పందాల గురించి తమకు తెలియదని ప్రభుత్వ అధికారులు చెప్పినట్లు ఎస్‌కేఎం ప్రకటన పేర్కొంది.

చరిత్రాత్మక తీర్పులకు కేరాఫ్ ఎన్వీ రమణ

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ దేశద్రోహ చట్టాన్ని నిలిపివేయడం, మనీలాండరింగ్ తీర్పును సమీక్షించడం, పెగాసస్, లఖింపూర్ ఖేరీ కేసులపై దర్యాప్తునకు ఆదేశించడం, రికార్డు స్థాయిలో 11 మంది న్యాయమూర్తుల నియామకాలను నిర్ధారించడం వంటి చరిత్రాత్మక తీర్పులను తన పదవీ కాలంలో వెలువరించారు. మొట్టమొదటిసారిగా సుప్రీం కోర్టులో విచారణను ప్రత్యక్ష ప్రసారాన్ని చేయడం ద్వారా ఆయన కీర్తి కిరీటంలో ఈ ఘటం మరో కలికితురాయిగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా, పొన్నవరం గ్రామంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన జస్టిస్ రమణ 2021 ఏప్రిల్ 24న ఎస్ఏ బాబ్డే స్థానంలో నియమించబడ్డారు. నవంబర్ 17, 2019న అప్పటి సీజేఐ రంజన్ గొగోయ్ పదవీ విరమణ చేసిన తర్వాత సుప్రీంకోర్టుకు ఒక్క న్యాయమూర్తి ఎంపిక కాలేదు. సీజేఐగా రమణ బాధ్యతలు స్వీకరించినప్పుడు తొమ్మిది ఖాళీలు ఉన్నాయి. హైకోర్టులలో దాదాపు 600 ఖాళీలు ఉన్నాయి. సీజేఐ నేతృత్వంలోని అత్యున్నత న్యాయస్థానం కొలీజియం సమావేశాలు 11 మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి దారితీశాయి. వారిలో ముగ్గురు మహిళలు సహా ఏకంగా 9 మందిని నియమించారు. కరోనా మహమ్మారి సమయంలో కోర్టులు నిరంతరాయంగా పనిచేసేలా చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ట్రిబ్యునళ్లలో దాదాపు 100 ప్రిసైడింగ్ అధికారులు, సాంకేతిక, చట్టపరమైన సభ్యుల నియామకాలను కూడా ఆయన నిర్ధారించారు. అంతేకాకుండా మేనెలలో దేశద్రోహ చట్టానికి సంబంధించి చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారు. పదవీ విరమణకు ఒక రోజు ముందు, సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం కార్తీ చిదంబరం అభ్యర్థనతో సహా అనేక ముఖ్యమైన కేసులను స్వీకరించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారాలను సమర్థించిన వివాదాస్పద తీర్పును బహిరంగ కోర్టులో సమీక్షించాలని నిర్ణయించింది. 2002లో బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం, ఆమె కుటుంబ సభ్యుల హత్య కేసులో 11 మంది దోషుల విడుదలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సీజేఐ ప్రత్యేక బెంచ్‌కు నాయకత్వం వహించి గుజరాత్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటన సందర్భంగా భద్రతా ఉల్లంఘనపై విచారణ జరిపిన కమిటీ నివేదికలోని ఫలితాలను కూడా పరిగణనలోకి తీసుకుని, ఫిరోజ్‌పూర్ ఎస్ఎస్పి తగినంత బలం అందుబాటులో ఉన్నప్పటికీ తన విధిని నిర్వర్తించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా సీజేఐ నివేదికను కేంద్రానికి పంపించారు. అలాగే ఎన్వీ రమణ కృషి వల్ల హైకోర్టు బెంజ్ సంఖ్య 24 నుంచి 42కి పెరిగింది. తన పదవీకాలం ప్రారంభంలో, సిబిఐ డైరెక్టర్‌ను ఎంపిక చేయడానికి ప్రధాని, ప్రతిపక్ష నాయకుడితో పాటు సెలెక్షన్ ప్యానెల్‌లో భాగమైన సీజేఐ, సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయడం ద్వారా ఎస్‌కె జైస్వాల్‌ను అధిపతిగా నియమించారు. ఢిల్లీ హైకోర్టుకు జడ్జిగా పదోన్నతి పొందేందుకు స్వలింగ సంపర్కుడైన సీనియర్ న్యాయవాది సౌరభ్ కిర్పాల్ పేరును మళ్లీ సిఫార్సు చేయడంపై సీజేఐని అనేకమంది అభినందించారు. 1957 ఆగస్టు 27న జన్మించిన జస్టిస్ రమణ ఫిబ్రవరి 10, 1983న న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. జూన్ 27, 2000న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులైన ఆయన, మార్చి 10, 2013 నుంచి మే 20, 2013 వరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. జస్టిస్ రమణ సెప్టెంబర్ 2, 2013న ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొంది, నియమితులయ్యారు.

1న రైతుల జాతీయ డిమాండ్ల దినం

- దేశ వ్యాప్తంగా నిరసనలు-ప్రదర్శనలు
- రాష్ట్రపతి ముర్ముకు మెమోరాండం సమర్పణ
- విజయవంతానికి అతుల్ కుమార్ అంజన్ పిలుపు

న్యూఢిల్లీ : దేశంలో రైతుల ఉద్యమం అనేక దశల్లో.. వేర్వేరు రూపాల్లో కొనసాగుతోంది. అఖిలభారత కిసాన్ సంఘర్ష సమన్వయ కమిటీ, సంయుక్త కిసాన్ సభ, ఏఐకేఎస్ ఆధ్వర్యాన వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలు, నిరసనలు, ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో రైతాంగ డిమాండ్ల సాధనే లక్ష్యంగా సెప్టెంబరు ఒకటవ తేదీన అఖిలభారత కిసాన్ డిమాండ్ల దివస్‌గా పాటించాలని రైతులు, గ్రామీణ ప్రజలకు ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ పిలుపునిచ్చారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగ ఉద్యమం క్రమంలో తమ సమస్యల పరిష్కారానికి చేసుకున్న ఒప్పందానికి కట్టుబడని ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. సర్కార్‌కు వ్యతిరేకంగా అన్ని స్థాయిల్లో నిరసనలు చేపట్టాలని సూచించారు. సెప్టెంబరు 1న బహిరంగ సభలు, నిరసన ర్యాలీలు, టార్చ్‌లైట్ ప్రదర్శనలను నిర్వహించి మెమోరాండాలను నూతన రాష్ట్రపతి ద్రౌపతిముర్ముతో పాటు జిల్లాల కలెక్టర్లు, గవర్నర్లకు అందజేయాలని అంజన్ పిలుపునిచ్చినట్లు ఏఐకేఎస్ అధికారిక ప్రకటన వెల్లడించింది. సింఘు, టిక్రీ, గాజీపూర్, ఢిల్లీ షాజహాన్ సరిహద్దు, పల్వాల్ ప్రాంతాల్లోనూ అన్నదాతలు వేలాదిగా ఈ నిరసనల్లో పాల్గొన్నారు. రైతుల ఆందోళన 13 నెలల పాటు సాగింది. సామాన్యులు, కార్మిక, యువజన, మహిళ, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు సంఘీభావాన్ని తెలుపుతూ మూడు నల్లచట్టాలు రద్దునకు మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. ప్రధాని మెట్టు దిగి ఎంఎస్‌పీతో పాటు రైతుల ఇతర సమస్యల పరిష్కారం కోసం కమిటీని నెలలోగా ఏర్పాటు చేస్తామన్నారు. ఇదే క్రమంలో రైతులకు, ప్రభుత్వ అధికారులకు మధ్య ఒప్పందం జరిగింది. ఆరు నెలల తర్వాత27 మందితో ప్రకటించిన కమిటీ ఎంఎస్‌పీ, 750 మంది అమరులైన రైతుల కుటుంబాలకు పరిహారం, వారికోసం స్మారకచిహ్నం, విద్యుత్ బిల్లు 2020 సంపూర్ణ ఉపసంహరణ, రుణమాఫీ, ఉద్యమ సమయంలో రైతులపై పెట్టిన 80వేల పోలీసు కేసుల కొట్టివేతకు పటిష్ఠ చర్యలు, వీధి పశువుల నుంచి పంటలకు రక్షణ, యూపీలోని లఖింపూర్‌లో రైతుల హంతకులు, కుట్రదారులను తక్షణమే శిక్ష వంటివి పట్టించుకోలేదు. దీంతో అన్ని డిమాండ్ల సాధన కోసం సెప్టెంబరు 1న డిమాండ్ల దినాన్ని విజయవంతం చేయాలని అతుల్ కుమార్ అంజన్ పిలుపునిచ్చారు.

ఉత్తమ న్యాయమూర్తి రమణ

అటార్నీ జనరల్‌వేణుగోపాల్

న్యూఢిల్లీ : భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ఎన్వీ రమణ మేథావి, ఉత్తర న్యాయమూర్తి అని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ శ్లాఘించారు. ఈయన నేతృత్వంలో మొదటిసారి సుప్రీంకోర్టులో మొత్తం 34 జడ్జీలు పనిచేస్తున్నారని, ఉన్నత న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లలో గణనీయంగా నియామకాలు జరిగాయని తెలిపారు. '224 ఖాళీలను హైకోర్టుల్లో భర్తీ చేశారని, 100 మందికిపైగా ట్రిబ్యునళ్లలో నియమించారన్నారు. సీజేఐగా జస్టిస్ రమణ పదవీ వివరణ క్రమంలో నూతన శకానికి శుభాభినందనలు తెలుపుతున్నా.. ఇది మరింత ఫలప్రదంగా ఉంటుందనడంలో సందేహం లేదు అని అటార్నీ జనరల్ అన్నారు. సీజేఐ నుంచి తనకు ఎప్పటికప్పుడు మొట్టికాయలు పడేవని చమత్కరించారు. మనం ఒక మేధావి, ఉత్తమ న్యాయమూర్తిని కోల్పోతున్నామని సీజేఐ రమణనుద్దేశించి ఆయనన్నారు. ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా పన్నవరం గ్రామంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన జస్టిస్ రమణ 2021, ఏప్రిల్ 24న సీజేఐగా ఏఎస్ బాబ్డే పదవీ విమరణ తర్వాత పదవీ బాధ్యతలను చేపట్టారు. 16 నెలలకుపైగా భారత ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ రమణ శుక్రవారం పదవీ విమరణ పొందారు. సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి పదవీ విరమణ వయస్సు 65ఏళ్లు కాగా హైకోర్టు జడ్జీలు 62ఏళ్లకు రిటైరవుతారు.

తప్పుల్ని ఎత్తిచూపటం మా ఉద్దేశం కాదు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఏదైనా విషయాలపై మాట్లాడేటప్పుడు 'హోమ్‌వర్క్ చేయండి' అంటూ తనని ఉద్దేశించి అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వాశర్మ చేసిన వ్యాఖ్యపై కేజ్రీవాల్ శుక్రవారం స్పందించారు. తన ఉద్దేశం తప్పులను ఎత్తి చూపడం కాదని అన్నారు. దేశాన్ని బలోపేతం చేయడానికి 'మనం ఒకరి నుంచి ఒకరు నేర్చుకోవాలి' అన్నారు. కేజ్రీవాల్ బుధవారం ట్వీట్ చేస్తూ... పాఠశాలల మూసివేత పరిష్కారం కాదని, దేశవ్యాప్తంగా మరిన్ని పాఠశాలలను తెరవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అసోంలోని కొన్ని పాఠశాలలను మూసివేతపై ఒక వార్తా నివేదికను తన ట్వీట్‌కు జోడించారు. దీనిపై అసోం సీఎం శర్మ గురువారం ట్విట్టర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రియమైన అరవింద్ కేజ్రీవాల్ జీ- మీరు ఎప్పటిలాగే హోంవర్క్ లేకుండా ఏదో ఒకదానిపై వ్యాఖ్యానించారు! నేను విద్యా మంత్రిగా ఉన్న రోజుల నుండి ఇప్పటి వరకు, దయచేసి గమనించండి... అసోం ప్రభుత్వం 8,610 కొత్త పాఠశాలలను ఏర్పాటు చేసింది' అని ట్వీట్ చేశారు. గత ఏడేళ్లలో ఢిల్లీ ప్రభుత్వం ఎన్ని పాఠశాలలను ప్రారంభించిందని కూడా ఆయన ప్రశ్నించారు. కేజ్రీవాల్ దీనికి సమాధానంగా 'ఓహ్, చూడబోతే మీరు నేరం చేసినట్లుంది... మీ తప్పులను ఎత్తి చూపడం నా ఉద్దేశం కాదు...మనమంతా ఒకే దేశం. మనం ఒకరి నుండి మరొకరు నేర్చుకోవాలి, అప్పుడే భారతదేశం నంబర్ వన్ దేశంగా మారుతుంది'అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

రాజీనామాకు ఇదా సమయం...!

- జీఎన్ఏ డీఎన్ఏ మోదీకి చిక్కింది
- ఆజాద్ నిజస్వరూపాన్ని బయటపెట్టింది
- ఘాటుగా స్పందించిన కాంగ్రెస్



న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ ఘాటుగా స్పందించింది. రాజీనామా చేసేందుకు ఇదా సమయం అని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, జాతీయ ప్రతినిధి జైరాం రమేశ్ శుక్రవారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ నిలదీశారు. లేఖలో ఆజాద్ చేసిన వ్యాఖ్యలు రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు గురిచేస్తున్నాయని తెలిపారు. విషపూరితంగా వ్యక్తిగత దాడికి దిగడం ద్వారా గులాం నబీ ఆజాద్ అసలు రంగు బయట పడిందని పేర్కొన్నారు. ఇది చాలా దురదృష్టకరమని అన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం సహా అనేక అంశాలపై బీజేపీతో కాంగ్రెస్ పోరాటం సాగిస్తున్న తరుణంలో ఆజాద్ రాజీనామా చేయడం విచారకరమని అన్నారు. సెప్టెంబరు 4న రాంలీలా మైదాన్‌లో రాహుల్ గాంధీ ప్రసంగించనున్న 'మెహంగై పర్ హల్లా బోల్ ర్యాలీ' కోసం గత రెండు వారాలుగా కాంగ్రెస్ సంస్థ మొత్తం సిద్ధమైందని రమేశ్ తెలిపారు. ఆజాద్ రాజీనామా లేఖలోని అంశాలు వాస్తవంగా లేవని అన్నారు.

ఈ నెల 29న దేశవ్యాప్తంగా 22 విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేశామని, సెప్టెంబర్ 7న కన్యాకుమారి నుంచి భారత్ జోడో యాత్ర ప్రారంభం కానుందని తెలిపారు. అలాగే, భారత్ జోడో యాత్ర సందేశాన్ని అందించడానికి దేశవ్యాప్తంగా 32 విలేకరుల సమావేశాలను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. 'మెహంగై పర్ హల్లా బోల్' ర్యాలీ విజయవంతం కావాలని, 3,500 కి.మీ పొడవైన భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ వెంట నడవాలని కాంగ్రెస్ వాదులందరూ, కాంగ్రెస్ మహిళలు కోరుకుంటున్న ఈ సమయంలో ఆజాద్ పత్రికలకు విడుదల చేసిన ఈ లేఖను చదవవలసి రావడం చాలా దురదృష్టకరం, చాలా విచారకరం' అని రమేశ్ అన్నారు. ఆజాద్ రాసిన లేఖలోని అంశాలను కూడా ఆయన ప్రశ్నించారు. ఆజాద్ రాజీనామాను ఆయన రాజ్యసభ పదవీకాలం ముగియడంతో ముడిపెడుతూ, 'ఇది అతని నిజమైన స్వభావాన్ని వెల్లడిస్తుంది. జీఎన్ఏ డీఎన్ఏ మోడీకి చిక్కింది' అని జైరాం రమేశ్ ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు.

పార్టీ మీడియా విభాగం అధిపతి పవన్ ఖేరా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆజాద్‌పై విరుచుకుపడ్డారు. ఆయన రాజీనామాను రాజ్యసభ పదవీకాలం ముగియడానికి ముడిపెట్టారు. 'మీ రాజ్యసభ పదవీకాలం ముగిసిన వెంటనే, మీరు అశాంతికి గురయ్యారు. మీరు ఒక్క సెకను కూడా పదవి లేకుండా ఉండలేరు' అని ఖేరా అన్నారు. ఆజాద్‌కు పార్టీ అన్నీ ఇచ్చిందని, రాజీనామా చేస్తూ ఆరోపణలు చేయడం తగదని గుజరాత్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ రఘు శర్మ అన్నారు. ఆజాద్ నిష్క్రమణ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ అవుతుందా అని అడిగిన ప్రశ్నకు, పార్టీలో చేరే వారికి స్వాగతం, వెళ్లిపోతున్న వారికి స్వాగతమేనని ఇటీవల రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ చేసిన ప్రకటనను శర్మ పునరావృతం చేశారు. కాంగ్రెస్ నాయకుడు సందీప్ దీక్షిత్ మాట్లాడుతూ పార్టీకి గులాం నబీ ఆజాద్ రాజీనామా నిరాశ, ద్రోహ భావనను కలిగించిందని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ రాజీనామాపై ఆ పార్టీ సీనియర్ నేత, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీ ఆయనకు (ఆజాద్) అన్నీ ఇచ్చిందని, ఆయన ఈరోజు పేరున్న నాయకుడు అయ్యాడంటే ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ సోనియాగాంధీ కారణమని అన్నారు.

బీహార్ శాసనసభ స్పీకర్‌గా అవధ్ బిహారీ



పాట్నా: బీహార్ శాసనసభ స్పీకర్‌గా ఆర్‌జేడీ సీనియర్ నేత అవధ్ బిహారీ చౌదరి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల ప్రారంభంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత, 'మహాగత్‌బంధన్' ద్వారా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన విజయ్ కుమార్ సిన్హా రాజీనామా చేయడంతో ఆ పదవి ఖాళీగా ఉంది. చౌదరిని ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ప్రస్తుత ప్రతిపక్ష నేతగా మారిన సీనియర్ బీజేపీ నాయకుడు సిన్హా కలిసి స్పీకర్ స్థానంలోకి ఆహ్వానించారు. ఎథిక్స్ కమిటీ నివేదికను వ్యాపారాల జాబితా నుంచి "వదిలివేయడం"పై బీజేపీ సభ్యులు గందరగోళాన్ని సృష్టించారు. గత ఏడాది మార్చిలో సిన్హాను స్పీకర్ చాంబర్‌లో గంటల తరబడి బందీగా ఉంచినప్పుడు, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ఆర్జేడీకి చెందిన పలువురు ఎమ్మెల్యేల ప్రవర్తనపై నివేదిక ఉంది. నివేదికను ప్రవేశపెట్టాలనే డిమాండ్‌కు బీజేపీ సభ్యులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ సభలోకి ప్రవేశించారు. డిప్యూటీ స్పీకర్ మహేశ్వర్ హజారీ సభకు వెళ్లగానే వెల్‌లోకి దూసుకెళ్లారు. అయితే, స్పీకర్ ఎన్నికను ప్రారంభించాలని హజారీ ఆదేశించడంతో, బీజేపీ సభ్యులు విరమించుకుని తమ స్థానాల్లో కూర్చున్నారు. ఎథిక్స్ కమిటీ నివేదిక అంశాన్ని సిన్హా తన అభినందన ప్రసంగంలో లేవనెత్తారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్, డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ సివాన్ నుంచి అనేకసార్లు ఎమ్మెల్యేగా ఉన్న చౌదరిని అభినందించారు.

అవినీతి అధికారులపై 171 కేసుల పెండింగ్

న్యూఢిల్లీ : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 600 మందికి పైగా అధికారులపై 171 కేసులు విచారణ కోసం పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర విజిలెన్స్ కమిషన్ తెలిపింది. వీటిలో అత్యధికంగా 325 మంది అధికారులతో కూడిన 65 కేసులు ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) వద్ద ఉన్నాయి. కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్‌లో 67 మంది అధికారులపై 12 కేసులు, రైల్వే మంత్రిత్వ శాఖలో 30 మంది అధికారులపై 11 కేసులు, రక్షణ మంత్రిత్వ శాఖలోని 19 మంది అధికారులపై ఎనిమిది కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొంది. ఈ కేసులన్నింటినీ కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ చేస్తోంది.

కేరళలో నిరుపేదలకు భూమి హక్కులు

ముగిసిన చెట్టాచెల్ భూపోరాటం

తిరువనంతపురం : కేరళలో చెట్టాచెల్ భూపోరాటం ముగిసింది. దక్షిణ కేరళ జిల్లాలోని రెండు మారుమూల కుగ్రామాల్లో నివాసయోగ్యమైన భూమిని కోరుతూ భూమిలేని నిరుపేదలు దాదాపు రెండు దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం చేస్తున్నారు. అయితే అక్కడ నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం భూమి హక్కు పత్రాలను అందజేయడంతో ముగిసింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి కె.రాధాకృష్ణన్ గురువారం వితుర, కుట్టిచల్ గ్రామ పంచాయతీలలోని చెట్టాచల్, పంగవు గ్రామాలకు చెందిన 128 కుటుంబాలకు పట్టాలను అందజేశారు. రాధాకృష్ణన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సొంతంగా భూమి, పై కప్పు ఉండాలనేది కల అని అన్నారు. 'అయితే ఇక్కడ ఉన్న సామాజిక పరిస్థితుల కారణంగా మన సమాజంలో చాలా మంది ఈ కలను సాకారం చేసుకోలేకపోయారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పుడు అణగారిన వర్గాల కోసం భూమి, ఇళ్లతో సహా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది' అని ఆయన తెలిపారు. చెట్టాచల్‌లోని భూమిలేని కుటుంబాలకు భూమి హక్కు పత్రాలు అందజేయడంతో 2003 నుంచి చెట్టాచల్ భూపోరాటం పేరుతో చేపట్టిన నిరసనకు తెరపడింది. చట్టపరమైన అడ్డంకులు జిల్లా యంత్రాంగం షెడ్యూల్డ్ కులాల వర్గాలకు చెందిన వ్యక్తులకు భూమిని అప్పగించకుండా అడ్డుకుంది. అయితే, మంత్రి నిర్వహించిన వివిధ సమావేశాల ద్వారా ఈ సమస్య పరిష్కారమయింది.

మధుమేహ ఔషధ ధరల తగ్గింపు

న్యూఢిల్లీ: మధుమేహం సహా వివిధ వ్యాధుల చికిత్సకు వినియోగించే 45 రకాల మందులకు గరిష్ఠ చిల్లర ధరలను జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) సవరించింది. ఈ జాబితాలో జీర్ణాశయ సమస్యలు, జలుబు, కొలెస్ట్రాల్, నొప్పి నివారణలకు వాడే ముఖ్యమైన ఔషధాలూ ఉన్నాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు వినియోగించే సిటాగ్లిప్టిన్, మెట్‌ఫామిన్, లినాగ్లిప్టిన్, మెట్‌పామిన్ సమ్మిళిత ఔషధాలూ (కాంబినేషన్ డ్రగ్స్) ఎన్‌పీపీఏ సవరించిన ధరల జాబితాలో ఉన్నాయి. సిటాగ్లిప్టిన్‌పై 'మెర్క్‌షార్ప్ అండ్ డోమ్ (ఎంఎస్‌డి)'కు ఉన్న పేటెంట్ హక్కుల కాలపరిమితి గతనెలతో ముగిసింది. దీంతో మార్కెట్లోకి అనేక రకాల సిటాగ్లిప్టిన్ జనరిక్ ఔషధాలు అందుబాటులోకి వచ్చాయి. పేటెంట్ హక్కులు ముగిసిన నేపథ్యంలో తగ్గిన ధరల ప్రయోజనాన్ని ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో ఎన్‌పీపీఏ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మార్కెట్‌లో 15 మాత్రలు ఉండే సిటాగ్లిప్టిన్+మెట్‌ఫామిన్ ప్యాక్‌ను గరిష్ఠంగా రూ.345 వరకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఎన్‌పీపీఏ ఒక్కో ట్యాబ్లెట్ ధరల శ్రేణిని రూ.16-21 మధ్యకు తీసుకొచ్చింది. లినాగ్లిప్టిన్+మెట్‌పామిన్‌పై ఉన్న పేటెంట్ హక్కుల కాలపరిమితి సైతం వచ్చే నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ మాత్రల ధరలను కూడా ఎన్‌పీపీఏ నియంత్రించింది. ఒక్కో మాత్ర గరిష్ఠ ధరల శ్రేణిని రూ.16-25గా నిర్ణయించింది. 2.5 ఎంజీ మాత్ర ధరను రూ.16.17, 5 ఎంజీ ట్యాబ్లెట్ ధరను రూ.25.33గా స్థిరీకరించింది. టైప్-2 మధుమేహంతో బాధపడుతున్న వారిలో 30 శాతం మందికి వైద్యులు సిటాగ్లిప్టిన్ లేదా లినాగ్లిప్టిన్.. వంటి గ్లిప్టిన్ ఆధారిత ఔషధాలను సిఫారసు చేస్తున్నారని వైద్య నిపుణులు తెలిపారు. అలర్జీ, జలుబుకు వాడే పారాసిటమాల్, ఫినైల్‌ఫ్రైన్ హైడ్రోక్లోరైడ్, కెఫైన్ అండ్ డిఫెన్‌హైడ్రామైన్ హైడ్రోక్లోరైడ్ సమ్మిళిత ఔషధాల ఒక్కో మాత్ర ధరను రూ.3.73గా ఎన్‌పీపీఏ నిర్ణయించింది. యాంటిబయోటిక్‌గా ఉపయోగించే అమోక్సిసిలిన్, పొటాషియం క్లావులనేట్ కాంబినేషన్‌తో వచ్చే ఓరల్ సస్పెన్షన్ (సిరప్) ధరను రూ.168.43గా స్థిరీకరించింది.

బీజేపీ ప్రభుత్వం సీరియల్ కిల్లర్

సీబీఐ ఎఫ్ఐఆర్ బూటకం : సిసోడియా



న్యూఢిల్లీ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'సీరియల్ కిల్లర్'లా వ్యవహరిస్తోందని, వరుసబెట్టి రాష్ట్ర ప్రభుత్వాలను అంతమొందిస్తోందని ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా వ్యాఖ్యానించారు. తనపై సీబీఐ పెట్టినది బూటకపు ఎఫ్ఐఆర్ అని అన్నారు. శుక్రవారం ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతరులు చేసే మంచిని చూసి ప్రధాని మోదీ అభద్రతాభావానికి లోనవుతుంటారని సిసోడియా విమర్శించారు. ఇంతటి అధైర్యపరుడిని, అభద్రతాభావానికి లోనయ్యే వ్యక్తిని ఇప్పటివరకు చూడలేదని అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని అయి ఉండి.. తాను వేరొక ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా ఉంటే ఆయన ఇలా చేసివుంటేవారు కాదని అసెంబ్లీలో సిసోడియా ఉద్ఘాటించారు. కేంద్రప్రభుత్వం చేసిన మంచిని కేజ్రీవాల్ ఎప్పుడూ సమర్థించారుగానీ ప్రధాని అందుకు భిన్నంగా వ్యవహరించారన్నారు. తనతో పాటు తన పిల్లల దుస్తులను సైతం 14 గంటల తనిఖీల్లో భాగంగా సీబీఐ అధికారులు సోదా చేశారని, తన ఇంట్లో నుంచి వారికి ఏమీ లభించలేదని చెప్పారు. తనపై ఎఫ్ఐఆర్ బూటకమైనదిగా తెలిపారు. ఎటువంటి అవినీతికి పాల్పడలేదని అన్నారు. వారు (బీజేపీ) సీరియర్ కిల్లర్‌లా రాష్ట్ర ప్రభుత్వాలను అంతం చేస్తున్నారు. దీనికి పడే కష్టాన్ని స్కూళ్లు, ఆసుపత్రుల నిర్మాణానికి పడివుంటే ఫలితం ఉండేదని సిసోడియా అన్నారు. తమ ప్రభుత్వ ఎక్సైజ్ విధానం 2021-22 ఉపసంహరించబడిందని తెలిపారు. ఎక్సైజ్ విధానంలో ప్రజలపై ఎటువంటి భారం పడలేదని, ప్రభుత్వ ఆదాయం కూడా పెరిగిందని, అయినా అవినీతి జరిగిందని బీజేపీ ఆరోపణలు చేస్తోందని సిసోడియా అన్నారు.

బహిరంగ సభలో అభివాదం చేస్తున్న రాజా, నారాయణ, అనీ రాజా, రామకృష్ణ, జేవీఎస్ఎన్ మూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, రావుల వెంకయ్య, వనజ, ఈశ్వరయ్య, వందేమాతరం శ్రీనివాస్, మానం ఆంజనేయులు, ఓబులేసు తదితరులు

'బిల్కిస్ బానో' నిందితుల విడుదల దారుణం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అనీ రాజా

విశాలాంధ్ర–విశాఖ: గుజరాత్ అల్లర్లలో గర్భిణీ బిల్కిస్ బానోను కుటుంబ సభ్యులు చూస్తుండగా అత్యాచారం చేసిన నిందితులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేశారని, అదే సమయంలో ఆగస్టు 15న ఎర్రకోట పైనుంచి ప్రధాని నరేంద్ర మోదీ మహిళలపై జరుగుతున్న హింసపై ఉద్వేగపూరితంగా ప్రసంగించడం విడ్డూరమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అనీ రాజా విమర్శించారు. విశాఖలో శుక్రవారం సీపీఐ 27వ రాష్ట్ర మహాసభల సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీని అబద్ధాల కోరుగా అభివర్ణించారు. గుజరాత్ అల్లర్లలో గర్భిణీ బిల్కిస్ బానో పై సంఘపరివార్ బృందం అత్యాచారానికి పాల్పడిందని అన్నారు. అటువంటి నిందితులను విడుదల చేయడం దారుణమని అన్నారు. మరోపక్క తమిళనాడు, కర్ణాటకలో టాడా చట్టం కింద అరెస్టు చేసిన మహిళలు ఇప్పటికీ జైళ్లలో మగ్గుతున్నారని, టాడా చట్టం రద్దయినప్పటికీ వాళ్లు ఇంకా జైల్లోనే ఉన్నారని తెలిపారు.

భవిష్యత్తు రాజకీయాల్లో కీలకం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర–విశాఖ: సీపీఐ 27వ రాష్ట్ర మహాసభల్లో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తు రాజకీయాల్లో కీలకంగా ఉంటాయని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. విశాఖలో శుక్రవారం సీపీఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మహాసభల్లో తీసుకునే నిర్ణయాలు నూతన అధ్యాయాన్ని లిఖిస్తాయని చెప్పారు. మహాసభలో తీసుకునే నిర్ణయాలపై రాజకీయ పార్టీలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు, కృష్ణపట్నం పోర్టు తదితర అంశాలపై చర్చించి, తీర్మానాలు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని మూడు రాజకీయ పార్టీల్లో గందరగోళం నెలకొందన్నారు. ఈ మహాసభలు భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్దేశిస్తాయని ముప్పాళ్ల తెలిపారు.

సీఎం పర్యటన పేరుతో ఇబ్బందులు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర–విశాఖ: ముఖ్యమంత్రి పర్యటన పేరుతో సీపీఐ రాష్ట్ర 27వ మహాసభల ఏర్పాట్లకు జిల్లా అధికార యంత్రాంగం ఇబ్బందులు సృష్టించిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వేరే పార్టీ జెండా పెట్టడానికి వీల్లేదు అన్నట్టుగా అధికార యంత్రాంగం వ్యవహరించిందన్నారు. సీపీఐ మహాసభల సందర్భంగా నగరంలో పార్టీ జెండాలను పెట్టుకునేందుకు కూడా అనుమతించలేదని చెప్పారు. ఒక్కరోజు ముందు గురువారం అనుమతి ఇచ్చారని, జెండాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటే తర్వాత తొలగించారని అన్నారు. అగ్నిపథ్ నియామకాల కారణం చూపించి పార్టీ మహాసభలకు ముందుగా బుక్ చేసుకున్న వసతి సదుపాయాలను రద్దు చేసి స్వాధీనం చేసుకున్నారని ఆయన తెలిపారు. అధికార పార్టీకి అధికార యంత్రాంగం దాసోహం అన్నట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

విశాఖలో సీపీఐ రాష్ట్ర 27వ మహాసభల దృశ్యాలు

పూలజల్లుతో ప్రదర్శకులకు స్వాగతం పలుకుతున్న మహిళలు

కిలోమీటరు పొడవైన జెండాతో పార్టీశ్రేణులు

ప్రదర్శనకు స్వాగతం పలుకుతున్న సీపీఎం నాయకులు

ప్రదర్శనలో ఒక భాగం

ప్రజానాట్యమండలి కళాకారుల నృత్యప్రదర్శన

విప్లవగేయాలతో ఉర్రూతలూగిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

కళాకారుల తప్పెటగుళ్ల ప్రదర్శన

బహిరంగ సభా వేదికపై పార్టీ పతాకంతో జేజేలు పలుకుతున్న చిన్నారితో రామకృష్ణ, నారాయణ, రాజా, జేవీఎస్ఎన్ మూర్తి

27వ మహాసభ సూచికంగా 27 పతాకాలతో మహిళా వాలంటీర్లు

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.